పాఠశాలల నిర్వహణకు నిధుల విడుదల

ఏలూరు అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):పాఠశాలల నిర్వహణకు నిధుల లేమితో ఏళ్ల తరబడి ఇబ్బందులకు గురవుతున్న హెచ్ఎంలకు ఇది తీపి కబురు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి (2024-25) సంబంధించి తొలి అర్ధ భాగానికి స్కూలు కాంపోజిట్ గ్రాంట్ నిధులను విడుదల చేస్తూ సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలో 1,578 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు రూ.4.91 కోట్ల బడ్జెట్ నిధులకు ఆమోదం తెలపగా, ఇందులో సగం మొత్తాన్ని రూ.2.45 కోట్లను సంబంధిత పాఠశాలల బ్యాంకు ఖాతాలకు జమ చేసేలా నిధులను విడుదల చేశారు. ఈ నిధులతో విద్యుత్ బిల్లుల చెల్లింపు, స్టేషనరీ కొనుగోళ్లు, ఇతర ఖర్చులకు వినియోగించుకోవచ్చని సమగ్ర శిక్ష జిల్లా అధికారులు తెలిపారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య, యు-డైస్ వివరాల ప్రాతిపదికన కాంపోజిట్ గ్రాంట్ నిధులు విడుదలవుతాయి. నిధుల వినియోగపు బిల్లులను 'ప్రబంధ్' పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని హెచ్ఎంలను ఆదేశించారు. పీఎంశ్రీ పాఠశాలలు, కేజీబీవీలు, జూనియర్ కళాశాలకు ఈ నిధుల నుంచి మినహాయించారు. వీటికి ప్రత్యేక బడ్జెట్ ద్వారా నిధులు విడుదల చేస్తారు.



ధాన్యం అమ్మిన 48 గంటల్లోగా రైతుల ఖాతాల్లోకి సొమ్ము : మంత్రి మనోహర్

రైతులు పండించిన ధాన్యాన్ని తమకు నచ్చిన రైస్ మిల్లులకు తరలించవచ్చు. ఇది మిల్లుకు చేరిన 48 గంటల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమ చేస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. ఏలూరు కలెక్టరేట్‌లో మంగళవారం ఉదయం అధికారులతో సమీక్షించి, మంత్రి కొలుసు పార్థసారథితో కలిసి మాట్లాడారు. అనంతరం ఉంగుటూరు మండలం చేబ్రోలు రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మనోహర్ (చిత్రంలో) ప్రారంభించారు. 7లో..



తుఫాన్‌తో పలు రైళ్ల రద్దు

బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావం రైళ్ల రాకపోకలపై ప్రభావం చూపింది. ఈ నెల 24, 25 తేదీల్లో భారీ వర్షాలు, 140 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయన్న వాతావరణ శాఖ సూచనలతో రైల్వే శాఖ అప్రమత్తమైంది. తూర్పుతీర రైల్వే శాఖ ఏలూరు మీదుగా వెళ్ళే 27 రైళ్లను రద్దు చేసింది. -7లో



ప్రతిభకు కోత..

ఆర్జీయుకేటీ నూజివీడు క్యాంపస్ కేంద్రంగా అనేక మంది ట్రిపుల్ ఐటీ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్రస్థాయిల్లో యోగాసన పోటీల్లో ప్రతిభ చూపారు. అయితే తమకు మూడేళ్లుగా ప్రోత్సాహ మార్కులు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం చూపుతూ నిరుత్సాహ పరిచారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. -6లో



చిరుత..చిక్కలేదు

చిరుత ఇంకా చిక్కలేదు.. ద్వారకా తిరుమల మండలం ఎం.నాగులాపల్లి పరిసర ప్రాంతాల్లో నాలుగు రోజులుగా సంచరిస్తూ జనాన్ని భయపెడుతున్న చిరుత అధికారులు ఏర్పాటుచేసిన ఉచ్చుకు చిక్కడం లేదు. మంగళవారం సమీప భీమడోలు మండలం అంబర్‌పేట వసంతకాలనీ వద్ద చిరుత పాదముద్రలు గుర్తించారు. ఆ ప్రాంతంలో ట్రాప్ కెమెరాలు, బోనులు అమర్చారు. -6లో



నీటి సంఘాలకు.. ఎన్నికల నగారా!

కలెక్టర్ వెట్రిసెల్వి నోటిఫికేషన్ జారీ

- వచ్చే నెల 29లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి
- ఆలోపే 40 రోజుల మేర కార్యాచరణ
- కూటమి ప్రభుత్వంలో తొలి ఎన్నికలు ఇవే

> జిల్లాలో 356 నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికల నగారా మోగింది. ఈ మేరకు కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేశారు. రాబోయే 40 రోజుల వ్యవధిలో ఈ ఎన్నికలు నిర్వహణకు వీలుగా ప్రత్యేక కార్యాచరణ ప్రకటించారు. గత వైసీపీ ప్రభుత్వం నీటి సంఘాలను పక్కన పెట్టింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వీటి ప్రాధాన్యతను గుర్తించి ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపట్టింది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

2015 తర్వాత తొలిసారిగా సాగునీటి సంఘాలకు ఎన్నికల నిర్వహణకు కూటమి ప్రభుత్వం ముందుకొచ్చింది. ఈ ప్రక్రియంతా ఇంతకుముందు పూర్తి చేసేందుకు రెండు నెలల వ్యవధి పట్టేది. ఇప్పుడు దానిని 40 రోజులకు కుదించి వచ్చేనెల 21 నుంచి 29లోపు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో భాగంగానే ఓటరు జాబితా సిద్ధం చేయడానికి ప్రతీ మండలానికి నీటి వినియోగదారుల సంఘం పరిధిలో సంబంధిత తహసీల్దార్‌ను ఆథరైజ్డ్ అధికారిగా, ఆయకట్టు వివరాలు సరిచూసేందుకు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను నియమిస్తూ కలెక్టర్ వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీచేశారు. ఎట్టి పరిస్థితుల్లోను ఒకటికి రెండుసార్లు అన్నీ సరిచూసుకున్న తర్వాతే ముందుకెళ్లేలా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు.

నీటి సంఘాలకు జీవం

రైతు ప్రతినిధులు సభ్యులుగా ఉండే సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఆది నుంచి ప్రాధాన్యత ఉంది. 2003లో తొలిసారిగా ఈ సంఘాలు ఆవిర్భవించాయి. 2014-19 మధ్య అధికారంలో ఉన్న తెలుగుదేశం ఈ సంఘాల ప్రాధాన్యతను గమనించి 2015లో ఎన్నికలు నిర్వహించింది. ఐదేళ్లపాటు కాల పరిమితి 2020లోనే ముగిసింది. కాని అప్పటికే అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వీటిని పక్కన పెట్టింది. ఎక్కడికక్కడ ఎదురయ్యే ఆటంకాలను సవరించేందుకు అనువైన ఈ సంఘాల ఎన్నికలు, ప్రతినిధుల వ్యవహారాన్ని పక్కనపెట్టేసింది. రెండు పంటలకు నీరందించే అవకాశం ఉన్న ఈ తరహా జిల్లాల్లో రైతు ప్రతినిధుల పాత్ర అత్యంత కీలకం. కాని వైసీపీ ప్రభుత్వం ఇదేమీ పట్టించుకోలేదు. ఇప్పటివరకు సాగునీటి సంఘాల ఎన్నికలకు వీలుగా ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిర్వీర్యం చేసింది. ఈ సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని సాగునీటి ఒడిదుడుకుల నుంచి గట్టెక్కించాలని రైతులు పదేపదే కోరినా ఈ విషయమేదీ జగన్ ప్రభుత్వానికి తలకెక్కలేదు. ఈ దశలో తాము అధికారంలోకి వస్తే సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఆ హామీలో భాగంగానే తొలిసారిగా ఈ సంఘాలకు ఎన్నికల నిర్వహణకు వీలుగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. గ్రామాల వారీగా ఓటరు జాబితా తయారు చేయబోతున్నారు. నవంబరు 21, 23 తేదీల మధ్య సంఘ సభ్యులు, అధ్యక్షుడు, ఉపాధ్యక్షుని ఎన్నిక పూర్తి చేయాలి. 24-26 తేదీల మధ్య నీటి పంపిణీ సంఘాలు (డిసీ), 27-29 తేదీల మధ్య ప్రాజెక్టు కమిటీ (పీసీ) కార్యవర్గ ఎన్నికలు నిర్వహించే దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కడెక్కడ నీటి సంఘాలు ఉన్నాయో వాటి వివరాలన్నింటిని ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 356 నీటి సంఘాల్లో ఎంతమంది ఓటర్లు అనేది త్వరలోనే క్రోడీకరిస్తారు.

ఎన్నికల షెడ్యూల్ ఇలా..

- నోటిఫికేషన్ విడుదల : అక్టోబరు 21
- ప్రాదేశిక నియోజక వర్గాల ప్రచురణ : అక్టోబరు 31
- అభ్యంతరాల స్వీకరణ : నవంబరు 1, 2
- అభ్యంతరాలపై నిర్ణయం : నవంబరు 3
- తుది ప్రచురణ : నవంబరు 3
- ఓటరు జాబితా తయారీ : నవంబరు 6 నుంచి 10
- అభ్యంతరాల స్వీకరణ : నవంబరు 11, 12
- అభ్యంతరాలపై తుది నిర్ణయం : నవంబరు 13
- ఎన్నికల ప్రకటన : నవంబరు 20
- పోలింగ్ తేదీ : నవంబరు 21, 22, 23
- డిస్ట్రిబ్యూటరీ కమిటీ పోలింగ్ : నవంబరు 24 నుంచి 26
- ప్రాజెక్టు కమిటీ పోలింగ్ : నవంబరు 27 నుంచి 29



గాంధీ భవన్‌కు ఎదురుగా మద్యం దుకాణం ఏర్పాట్లు


మన్నించు మహాత్మా!

- గాంధీభవన్‌కు సమీపంలో మద్యం షాపు..
- అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలంటూ సర్వోదయ మండలి విజ్ఞప్తి

నిడమర్రు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):గాంధేయవాద సిద్ధాంతాలను ఆచరిస్తూ ప్రజల్లో స్ఫూర్తిని పెంపొందించడం కోసం ప్రముఖ గాంధేయవాది చింతలపాటి వరప్రసాదమూర్తిరాజు పెదనిండ్రకొలనులో నిర్మించిన గాంధీ భవన్ సమీపంలో మద్యం దుకాణం, బెల్ట్ షాపులు నిర్వహించవద్దని జిల్లా సర్వోదయ మండలి ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గాంధీ భవన్ సమీపంలోని వంతెన వద్ద ప్రభుత్వ ఆధ్వర్యంలో మద్యం దుకాణం నిర్వహిస్తుండగా స్థానికులు, గాంధేయవాదులు, విద్యార్థులు దానిని ఈ ప్రాంతం నుంచి తొలగించాలని పలుమార్లు విన్నవించినా స్పందన లేదన్నారు. ఈ నెల రెండో తేదీ గాంధీ జయంతి రోజున నిరసన తెలిపామన్నారు. అయితే ఇటీవల కొత్తగా ఏర్పాటైన ప్రైవేటు మద్యం దుకాణాన్ని గాంధీ భవన్‌కు అత్యంత సమీపంలో, గేటుకు ఎదురుగా ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఇదే జరిగితే గాంధీభవన్ ప్రతిష్ఠ దెబ్బతింటుందన్నారు. ఈ విషయమై ముఖ్యమంత్రికి, స్థానిక ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణం స్పందించి మద్యం దుకాణాన్ని గాంధీభవన్ సమీపంలో ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

రండీ.. ఆధార్ నవీకరించుకోండి

జిల్లావ్యాప్తంగా ప్రత్యేక శిబిరాల నిర్వహణ



మాదేపల్లిలో ఆధార్‌కార్డుకు ఐరిస్ నమోదు చేస్తున్న సిబ్బంది

ఏలూరు రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):ఆధార్ భారత విశిష్ట ప్రాధికార సంస్థ జారీ చేసిన గుర్తింపు సంఖ్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుకోవాలంటే తప్పనిసరి. మరోవైపు ఆధార్‌లో తప్పిదాలు ఉంటే అధికారులు సున్నితంగా తిరస్కరిస్తున్నారు. ఫలితంగా ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. సమస్యను అధికమించాలని కేంద్ర, రాష్ట్రాలు ముందు కొచ్చాయి. మంగళవారం నుంచి ఈనెల 25వ తేదీ వరకు ఆధార్ నవీకరణకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేశారు. ఇందులో భాగంగా జిల్లాలోను శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఏలూరు రూరల్ మండలంలో మాదేపల్లి, గుడివాకలంక, పైడిచింతపాడు గ్రామాల్లో ఉదయం ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించారు. ఏలూరు ఎంపీడీవో శ్రీలత మాట్లాడుతూ నూతన ఆధార్ కార్డులు ఎన్‌రోల్, బయోమెట్రిక్ అప్‌డేట్, డెమోగ్రాఫిక్ అప్‌డేట్, ఆధార్‌కార్డు డౌన్‌లోడ్ తదితర సర్వీసులు చేయడానికి ప్రత్యేక ఆధార్‌క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. ఆధార్ చేయించి పదేళ్లు దాటిన వారు అప్‌డేట్ చేయించుకోవాలని, ఏదైనా పేర్లు, ఇంటిపేరు, అడ్రస్ తదితర మార్పులు, చిన్నపిల్లలకు ఆధార్ చేయించుకోవాలన్నారు.

తుఫాన్ గుబులు

కొనసాగుతున్న వర్షాలు.. రైతుల్లో ఆందోళన

ఏలూరు సిటీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో మంగళవారం వర్షాలు కురిశాయి. తూర్పు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయు గుండంగా మారింది. ఇది తుఫాన్‌గా మారుతుందని వాతావరణ హెచ్చరికలు చెబుతున్నాయి. ఈ కారణంగా జిల్లాలో 26వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసింది. భారీ వర్షాల కారణంగా పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన సార్వా పంట వర్షాలకు నష్టపోయే పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. గడచిన 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా టి.నరసాపురం మండలంలో 25.2 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 5.5 మి.మీ. నమోదైంది. జంగారెడ్డిగూడెంలో 24.6, కామవరపుకోట 22.4, కైకలూరు 16.4, మండవల్లి 14.2, బుట్టాయిగూడెం 13.4, పోలవరం 9.2, కొయ్యలగూడెం 8.4, కుక్కునూరు 7, చింతలపూడి 4.2 మి.మీ. వర్షపాతాలు నమోదయ్యాయి.

ప్రతిభకు కోత



ఆవేదన

యోగాలో ట్రిపుల్ ఐటీ విద్యార్థుల టాలెంట్
299 పతకాలతో ఖ్యాతి
రచ్చ గెలిచినా ఇంట గెలవలేదు..
మూడేళ్లుగా ప్రోత్సాహక మార్కులు ఇవ్వని అధికారులు

నూజివీడు టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచగురువుగా భారతదేశానికి ఖ్యాతి తెచ్చిపెట్టిన యోగాను ప్రతి కళాశాలలోను ఒక బోధనాంశంగా చేర్చాలని యోగా డే సందర్భంగా భారత ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించారు. ఆర్జీయుకేటీ నూజివీడు క్యాంపస్ కేంద్రంగా అనేకమంది విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ప్రతిభ చూపారు. మొత్తం 299 పతకాలను సాధించడమే కాక గత టీడీపీ హయాంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఎదుట ప్రదర్శనలు చేసి సెల్యూట్ కొట్టించుకున్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ అధికారులు మాత్రం తమను గుర్తించలేదని ప్రోత్సాహక మార్కులను గత మూడేళ్లుగా ఇవ్వకుండా నిరుత్సాహ పరిచారని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు.

299 పతకాలతో అగ్రస్థానం

దేశంలోని ఇతర యూనివర్సిటీలతో పోలిస్తే ఆర్జీయుకేటీ నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు యోగాసన పోటీల్లో అగ్ర స్థానంలో నిలుస్తున్నారు. అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర యోగా పోటీల్లో ట్రిపుల్ ఐటీ



విద్యార్థులు 170 బంగారు పతకాలను, 74 రజత, 55 కాంస్య పతకాలను గెలుచుకున్నారు. ఒక్క నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ నుంచి 3,500 మంది విద్యార్థులు యోగాలో నిష్ణాతులుగా తయారయ్యారు. ప్రస్తుతం 500 మంది విద్యార్థులు యోగశాలలో తర్ఫీదు పొందుతున్నారు.

ప్రోత్సాహక మార్కులు నిల్

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు మూడేళ్లుగా ప్రోత్సాహక మార్కులు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారు. దీనిపై గత ప్రభుత్వ హయాంలో విద్యార్థులు ట్రిపుల్ ఐటీ ఉన్నతాధికారులు, చాన్సలర్ కేసీ రెడ్డికి రాత పూర్వకంగా అనేక అభ్యర్థనలు పంపారు. విద్యార్థులకు ప్రోత్సాహక మార్కులు కలపాలని నాటి చాన్సలర్ సూచనలు చేసినా ట్రిపుల్ ఐటీ అధికారులు పట్టించుకోలేదు. చాన్సలర్ నిర్ణయంపైనే మరో కమిటీ వేసి కాలయాపన చేశారు. క్రీడాంశాల అభివృద్ధి, క్రీడాకారులకు అందించాల్సిన ప్రోత్సాహకాలకు సంబంధించిన అంశాలపై ఆయా క్రీడల్లో నిష్ణాతులైన వారితో కమిటీలను ఏర్పాటు చేయాలి. కానీ నూజివీడు ట్రిపుల్ ఐటీలో అందుకు విరుద్ధంగా సంబంధం లేని వారిని నియమించారని దీంతో విద్యార్థులకు సరైన న్యాయం జరగడం లేదని ఆరోపణలున్నాయి.

మార్కుల కోతతో నిరుత్సాహం

ఆర్జీయుకేటీ నిబంధనల ప్రకారం గత టీడీపీ హయాంలో 2019లో క్రీడలు, ఎన్‌సీసీ, యోగశాలలో పాల్గొన్న క్రీడాకారులకు ప్రోత్సాహక మార్కులను నిర్దేశించారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తే 15 మార్కులు, పాల్గొనవారికి 10, జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తే 10, పాల్గొన్న వారికి 5, దక్షిణ భారతస్థాయిలో పతకాలు సాధిస్తే 8, పాల్గొన్నవారికి 3 మార్కులు ప్రతి సబ్జెక్టు ఇవ్వాలని గతంలో నిర్ణయించారు. ఆ నిర్ణయాలను తోసిరాజని నేడు ప్రోత్సాహక మార్కుల జారీలో కోత విధించారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన వారికి 3 మార్కులు, పాల్గొన్న వారికి 2, జాతీయస్థాయిలో పతకాలు సాధించిన వారికి 2, పాల్గొన్న వారికి ఒక మార్కు మాత్రమే కలపాలని నిర్ణయించడంతో యోగా క్రీడాకారుల్లో నిరుత్సాహం నెలకొంది. దీనిపై ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ డాక్టర్ అమరేంద్ర కుమార్‌ను వివరణ అడగ్గా ప్రోత్సాహక మార్కులు విషయం తన దృష్టికి వచ్చిందని, వారంలోపు ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని వివరణ ఇచ్చారు.

ప్రత్యేకం



ఇప్పటికీ ఆ స్కూల్ బెస్టే..

ప్రైవేటుకు దీటుగా భీమవరం పీఎస్‌ఎం పాఠశాల విద్యార్థుల ప్రతిభ

భీమవరం ఎడ్యుకేషన్, అక్టోబరు 22 : ఎంత ఫీజు ఎక్కువ చెల్లిస్తే అంత మంచి విద్య అందుతుందని ఇప్పటి తరం తల్లిదండ్రులు భావిస్తుంటారు. స్తోమత లేకపోయినా తమ పిల్లలకు మంచి విద్య ఇవ్వాలనే తాపత్రయంతో ప్రైవేటు స్కూల్స్‌లో చదివిస్తున్నారు. ఇలాంటి పరిస్థితులు ఉన్న కాలంలో ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మంచి చదువు అందిస్తున్నారు. భీమవరం పట్టణంలోని పొట్టి శ్రీరాములు (పీఎస్‌ఎం) బాలికల పాఠశాల పదేళ్లుగా పదో తరగతి ఫలితాలలో ప్రైవేటు పాఠశాలలతో పోటీపడి విద్యార్థినులు మంచి మార్కులు సాధిస్తున్నారు. దీంతో పీఎస్‌ఎం బెస్ట్ పాఠశాలగా అనే పేరు గాంచింది. 1951లో ఈ పాఠశాల ప్రారంభమైంది. ప్రత్యేక తరగతులు, అత్యుత్తమ శ్రద్ధ, ఉత్తమ బోధనతో ఈ స్కూల్ మంచి పేరు సాధించింది.

విద్యార్థుల సంఖ్యలోనూ బెస్టే..

ప్రభుత్వ పాఠశాలలో విద్యపై మక్కువ తగ్గటం గడిచిన పదేళ్లలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. సగం అంతకన్నా ఎక్కువమంది



విద్యార్థులు ప్రైవేటుకు వెళ్లిపోయారు. అయితే పీఎస్‌ఎం గరల్స్ పాఠశాలలో పెరుగుతూ వస్తోంది. ఐదేళ్ల క్రితం అడ్మిషన్లు ఫుల్ అనే బోర్డు కూడా పెట్టారు. అదే జోరు ఇప్పటికి కొనసాగుతోంది. అందరూ బాలికలే అయిన ఆ పాఠశాలలో 1,042 విద్యార్థినులు ఈ ఏడాది విద్యనభ్యసిస్తున్నారు.

మార్కుల్లో ప్రతీ ఏటా పోటీ

పదో తరగతి ఫలితాలలో ప్రైవేటు పాఠశాలలు, కార్పోరేట్ స్కూల్స్ తమ స్కూల్ విద్యార్థులు టాప్‌లో నిలిచారంటూ ఊదరగొడతారు. పీఎస్ం గరల్స్ హైస్కూల్ విద్యార్థులు కూడా వారితో పోటీ పడతారు. 2023-24 విద్యా సంవత్సరంలో ఇద్దరు విద్యార్థినులు 581 మార్కులు సాధించారు. 2022-23 విద్యా సంవత్సరంలో 582 మార్కులు వచ్చాయి. 2021-22లో 585 మార్కులు సాధించారు. ఇలా ప్రతీ ఏడాది పదిలో మంచి మార్కులు సాధిస్తున్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు

ప్రభుత్వ ఉద్యోగులు వారి పిల్లలను ఇదే పాఠశాలలో చదివిస్తున్నారు. 2017 సంవత్సరంలో ఇద్దరి విద్యార్థినులు టౌన్‌లోనే మంచి మార్కులు సాధించారు. వాళ్ళిద్దరూ ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలే. ఈ ఏడాది కూడా ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు పీఎస్‌ఎంలో చాలా మంది చదువుతున్నారు.

పది పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ



పాఠశాలలో విద్యాబోధనలో ప్రతీ ఉపాధ్యాయుడు ప్రత్యేక శ్రద్ధచూపుతారు. పదవ తరగతి విద్యార్థినులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తాం. తల్లితండ్రులు ప్రోత్సాహం, విద్యార్థినుల ఉన్నత లక్ష్యంతో విజయాలు సాధిస్తున్నాం.

- రాధాకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు



పాలకొల్లు శ్రీ క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లపై ఆర్డీవో దాసి రాజు సమీక్ష

కార్తీకమాసం భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

నరసాపురం ఆర్డీవో దాసిరాజు

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):కార్తీక మాసంలో ఆలయానికి వచ్చే భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా దేవాదాయ, రెవెన్యూ, మున్సిపల్, ఆర్టీసీ, విద్యుత్ శాఖ, పోలీసు, ఫైర్, వైద్య ఆరోగ్యశాఖ తదితర ప్రభుత్వ శాఖలు, సేవా సంస్థలతో సమన్వయం చేసుకుని సౌకర్యాలు కల్పించాలని నరసాపురం ఆర్డీవో దాసి రాజు అన్నారు. పంచారామ క్షేత్రం క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయానికి కార్తీక మాసం నెల రోజులు, ముఖ్యంగా ఆది, సోమవారాలు, పౌర్ణమి రోజుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆలయంలో మంగళవారం వివిధ శాఖల అధికారులతో ఆర్డీవో సమావేశం నిర్వహించారు.

నవంబరు 2వ తేదీ నుంచి కార్తీక మాసం రానున్నందున ముందస్తు చర్యల్లో భాగంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్, పారిశుధ్యం, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలు, వంటి పలు అంశాలపై ఆయా శాఖల అధికారులతో ఆర్డీవో సమీక్షించారు. కార్తీక మాసం నెల రోజులు సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆలయం సమీపంలోని రేపాకవారి సత్రంలో భక్తులకు అన్నదానం ఉంటుందని, ఇంకా పలు సేవా సంస్థలు ఫలహారాలు, క్షీరా రామలింగేశ్వర స్వామి సేవాసమితి ఆధ్వర్యంలో బాదం పాలు వంటివి అందజేస్తారని తెలిపారు. ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు మూడు రకాల క్యూలైన్లు ఉంటాయని అవి ధర్మదర్శనం, ప్రత్యేక దర్శనం, అభిషేకాలు చేసుకున్నవారికి మరో క్యూలైన్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్తీకమాసంలో ప్రతీరోజూ ఉదయం 4 గంటల నుంచి రాత్రి 9 వరకూ ఆలయం తెరిచి ఉంటుందని, ఆదివారాలు రాత్రి 10 గంటల వరకు, సోమవారాలు రాత్రి 11 గంటల వరకు స్వామివారి దర్శనం ఉంటుం దని అర్చకులు ర్యాలి రామకృష్ణ తెలిపారు. తహసీల్దార్ దుర్గా కిషోర్, మునిసిపల్ కమిషనర్ విజయసారధి, పట్టణ ఎస్‌ఐ బాదం శ్రీనివాస్, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

స్నాన ఘట్టాలు పరిశుభ్రపర్చాలి

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):కార్తీకమాసం నేపథ్యంలో భక్తులు కాలువ స్నానం చేసేందుకు అనువుగా ఏలూరు కాలువకు ఉన్న స్నాన ఘట్టాలన్నింటినీ పరిశుభ్రపర్చాలని, ఈ స్నాన ఘట్టాల వద్దే జల్లు స్నానాలు ఏర్పాటు చేయాలని, దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక టెంట్‌లు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. ప్రస్తుతం స్నాన ఘట్టాలన్నీ అపరిశుభ్రతగా ఉన్నాయని, చెత్తా చెదారం, వ్యర్థాలతో ఉన్నాయని తెలిపారు.



ఏలూరు కాలువ గట్టు వద్ద అపరిశుభ్రంగా ఉన్న స్నాన ఘట్టం

మద్ది క్షేత్రానికి భక్తుల తాకిడి

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురవాయి గూడెం మద్ది ఆంజనేయ స్వామిని దర్శించుకోవడానికి మంగళవారం భక్తులు బారులు తీరారు. వేకువ జాము నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ప్రీతికరమైన తమలపాకులతో విశేష పూజలు నిర్వహించారు. భక్తుల కోసం బొర్రంపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం నాటికి వివిధ సేవల రూపంలో రూ.1,39,991 ఆదాయం సమకూరినట్లు ఈవో చందన తెలిపారు.





ప్రకాశం చౌక్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

అధ్వాన్న రోడ్లపై సీపీఐ 36 గంటల నిరసన

భీమవరం అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా నలుమూలల నుంచి జిల్లా కేంద్రం భీమవరం చేరుకునే అన్ని రోడ్లు తీవ్ర అధ్వాన్న స్థితికి చేరుకుని ప్రమాదాలకు నిలయాలుగా మారాయని తక్షణమే రోడ్ల నిర్మాణం చేపట్టాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం భీమవరం ప్రకాశం చౌక్ వద్ద చేపట్టిన 36 గంటల నిరసన దీక్షను నాగేశ్వరరావు ప్రారంభించారు. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగానే రోడ్లు అధ్వాన్న స్థితికి చేరాయన్నారు. తెలుగు దేశం కూటమి అధికారంలోకి వచ్చి నాలుగు నెలల కావొస్తుందని రోడ్లపై దృష్టి సారించాలని కోరారు. సీపీఐ జిల్లా కార్య దర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ జిల్లాలో అన్ని రహదారులు పెద్ద పెద్ద గోతులతో చెరువులను తలపిస్తున్నాయన్నారు. వాహనాలు గోతుల్లో పడి తీవ్ర ప్రమా దాలకు గురవుతున్నా రన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరనాధరెడ్డి దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.



నాడు

ఎంతో మారిపోయింది !

ఈ రెండు రహదారులు చింతలపూడికి సంబంధించినవే.. ఒకటి 30 ఏళ్ల క్రితం నాటి ఈ ఫొటో.. మరొకటి ప్రస్తుత రోడ్డు.. ఇది చింతలపూడి ప్రధాన రహదారి. అప్పటికీ ఇప్పటికీ ఎన్నో మార్పులు వచ్చాయి. చింతలపూడి మేజర్ పంచాయతీగా ఉన్నప్పుడు మెయిన్‌రోడ్డు విస్తరించక ముందు ఇరుకుగా ఉండేది. నిత్యం ట్రాఫిక్ మయంగా ఉండేది. వై.ఎస్ రాజశేఖరరెడ్డి 2003లో పాదయాత్ర ఈ మార్గంలోనే వెళ్ళింది. ఆయన బోసుబొమ్మ సెంటర్‌లో మాట్లాడుతూ తమ ప్రభుత్వం వస్తే చింతలపూడి రోడ్డు విస్తరణ చేయిస్తానని ప్రకటన చేశారు. 2004లో అధికారంలోకి వచ్చాక 2005లో రోడ్డు విస్తరణ జరిగింది. పాతబస్టాండ్ ఏరియా నుంచి రత్నా సినిమా థియేటర్ వరకు ఇరుపక్కలా భవనాలు తొలగించి 66 అడుగుల రోడ్డుగా విస్తరించారు. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. దీంతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించింది. **- చింతలపూడి/ఆంధ్రజ్యోతి**



నేడు



భీమడోలు మండలంలో చిరుత సంచార పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది

చిరుత..చిక్కలేదు !

అంబర్‌పేటలో పాదముద్రలు

ద్వారకాతిరుమల/భీమడోలు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ద్వారకా తిరుమల మండలం ఎం.నాగులపల్లి ప్రజలను హడలెత్తిస్తున్న చిరుత ఇంకా చిక్కలేదు. గత నాలుగు రోజులుగా ఈ గ్రామ సమీపంలో సంచరించినట్లు చిరుత పాదముద్రలను అటవీ శాఖ అధికారులు గుర్తించిన విషయం విదితమే. అయితే మంగళవారం సమీపంలోని భీమడోలు మండలం అంబర్‌పేట వసంతకాలనీ వెనుక ఉన్న చెరకు తోటల వైపుగా చిరుత వెళ్లిందన్న సమాచారం గుప్పుమంది. అక్కడ చిరుత పాదముద్రలు ఉన్నాయన్న సమాచారంతో అటవీశాఖ అధికారులు అక్కడకు చేరుకుని వాటిని పరిశీలించారు. ఆ ప్రాంతంలో ట్రాప్ కెమేరాలను, పట్టుకునేందుకు అదనపు బోనులను ఏర్పాటు చేసినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. ప్రజలెవ్వరూ భయపడాల్సిన పనిలేదని కాస్త జాగ్రత్త వహించాలని, రైతులను చెరకు తోటల్లోకి వెళ్లవద్దని వారు సూచించారు. ఇదిలా ఉండగా చిరుత దొరికిందని, మరోవైపు దొరకలేదని సోషల్ మీడియాలో మెసేజ్‌లు మంగళవారం హల్‌చల్ చేశాయి.

చరిత్ర

ఆ గాలి గోపురానికి మూడు వందల ఏళ్లు

చాట్రాయి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా చాట్రాయి మండలం చనుబండలో అపర భద్రాద్రిగా పేరుగాంచిన కోదండ రామస్వామి ఆలయంలో 1713లో నిర్మించిన గాలి గోపురం గత వైభవానికి సాక్ష్యంగా నిలిచింది. ఈ 301 ఏళ్లలో ఎన్నో తుపానులు, ప్రకృతి వైపరీత్యాలు వచ్చినా చెక్కు చెదరకుండా నిలిచి ఉంది. చారిత్రక ఆధారాలను బట్టి నరసింహారావుపాలెం గ్రామానికి చెందిన పుచ్చకాయల రామిరెడ్డి అనే రామ భక్తుడు భక్తుల సహకారంతో ఈ గాలి గోపురాన్ని నిర్మించారు. రెండంతస్తులు 30 అడుగుల ఎత్తులో నిర్మించిన గాలి గోపురంపై శ్రీరామ పట్టాభిషేకం, మహాభారతం, దేవతా మూర్తులు, రుషుల శిల్పాలు, వాత్సాయన కామసూత్రకు సంబంధించిన ప్రతిమలు ఉన్నాయి. తెలంగాణ-ఆంధ్ర రహదారిలో ఉన్న ఈ గాలి గోపురానికి దారిలో ప్రయాణించే వారు నమస్కరించి వెళుతుంటారు. ఏదైనా పనుల కోసం వెళ్లేవారు ఈ గాలి గోపురానికి నమస్కరించి వెళితే అంతా శుభమే జరుగుతుందని భక్తుల విశ్వాసం. ఈ గాలి గోపురంపై ఉన్న శిల్ప సంపద శిథిలావస్థకు చేరడంతో 2023లో చనుబండ గ్రామస్థుడు వనమా కేశవరావు కుమారులు నవీన్, సుధాకర్ రూ.25 లక్షలతో గాలి గోపురానికి మరమ్మతులు చేయించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో పురాతనమైన ఆలయం ఇది. ఇక్కడ జరిగే సీతారామ కల్యాణానికి చుట్టుపక్కల మండలాలు, జిల్లాల నుంచే కాక సరిహద్దున ఉన్న తెలంగాణ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు.



చాట్రాయి మండలం చనుబండ కోదండ రాముడి ఆలయ గాలి గోపురం

25న నూజివీడు ఐటీఐలో జాబ్‌మేళా

నూజివీడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాల కల్పనకు ఈనెల 25వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నూజివీడు ప్రభుత్వ ఐటీఐ ప్రధాన అధికారి దేవరకొండ భూషణం తెలిపారు. 10వ తరగతి ఆపై అర్హత కలిగిన అభ్యర్థులకు ఈ నెల 25వ తేదీ 10 గంటల నుంచి నూజివీడు ఐటీఐ కళాశాల ప్రాంగణంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, బయోడేటా, విద్యార్హత ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు.

4న విజయవాడలో ప్రజా హక్కుల ర్యాలీ

చాట్రాయి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రజా వ్యతిరేక పాలనకు నిరసనగా డిసెంబరు 4న విజయవాడలో ప్రజా హక్కుల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరనాధ్ అన్నారు. 23న నూజివీడు అమర్ భవన్‌లో కార్యకర్తల సమావేశం జరుగుతుందని పోలిట్ బ్యూరో సభ్యుడు శంకర్, రాష్ట్ర కార్యదర్శి బంగార్రాజు హాజరవుతారన్నారని తెలిపారు.



ఉత్సాహంగా స్కేటింగ్ పోటీలు

ఏలూరు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏలూరు ఇండోర్‌స్టేడియంలో ఎంపిక పోటీలు ఉత్సాహంగా జరిగాయి. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కానాల రమేష్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడల ద్వారా శారీరక, మానసిక వికాసంతో పాటు విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందన్నారు. ఎంపిక పోటీలకు ఏలూరు జిల్లా వ్యాప్తంగా 100 మందికి పైగా హాజరయ్యారని, ఐదేళ్ళ నుండి 17 ఏళ్ల లోపు బాలబాలికలకు రింక్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. బుధవారం రోడ్డు స్కేటింగ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు కాకినాడలో నవంబరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ఉర్దూ అకాడమీ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జాతీయ పురస్కారాల కోసం దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఉర్దూ అకాడమీ డైరెక్టర్ (విజయవాడ) ఆదేశాలు జారీచేశారని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఎస్.ఎస్ కృపావరం ఒక ప్రకటనలో తెలిపారు. ఉర్దూ సాహిత్య వేత్తలు, స్కాలర్లు, కవులు, పాత్రికేయులు, పరిశోధన తదితర రంగాల్లో సేవలు అందించిన ఆరుగురికి జీవితకాల సాఫల్య పురస్కారాలు అందచేయనున్నట్లు తెలిపారు. ఉర్దూ భాషాభివృద్ధికి కృషిచేసిన ఉపాధ్యాయులకు, రాణించిన విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తామన్నారు.

డంపింగ్ యార్డుకు ఇస్తే ఊరుకోం



మంచినీటి చెరువును డంపింగ్‌యార్డుకు కేటాయిస్తే ఊరుకోం. పట్టణ పరిధిలో అనేక ఆక్రమణలు ఉన్నాయి వాటిని వెలికి తీసి ఆ స్థలాలు కేటాయించాలి. వేసవితో పాటు ఏడాది పొడవునా నగర పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్య తలెత్తుతుంది.ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు.

పుప్పాల పండు, కౌన్సిలర్, ఆకివీడు

శాశ్వత డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలి



పట్టణ పరిధిలో శాశ్వత డంపింగ్‌యార్డు లేకపోవడంతో చెత్త రోడ్లమీదనే వేస్తున్నారు. సిద్ధాపురం వైపు వెళ్లే రోడ్‌లో అనధికార డంపింగ్‌యార్డు ఉండడంతో చెత్తను రోడ్‌పై వేయడంతో స్థానికులు దుర్వాసనతో అల్లాడుతున్నారు. రోగాలు బారిన పడుతున్నారు. అధికారులు ఆక్రమణలు గుర్తించి పట్టణానికి దూరంగా డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయాలి.

కటికతల జాన్‌వెస్లీ, కౌన్సిలర్, ఆకివీడు

చెత్త వేసేందుకు చెరువే దొరికిందా !

ఆకివీడులో డంపింగ్ యార్డుకు మంచినీటి చెరువు కేటాయింపు
ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పట్టణ వాసులు

ఊరి వ్యథ

ఆకివీడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మంచినీటి చెరువును డంపింగ్‌యార్డుకు కేటాయించడంపై ఆకివీడులో నిరసన స్వరాలు వినిపిస్తున్నాయి. ఈ విషయం అధికారులు పాలకమండలి దృష్టికి తీసుకురావడాన్ని పలువురు కౌన్సిలర్లు వ్యతిరేకిస్తున్నారు. మంచినీటి చెరువులు అభివృద్ధి చేయాలని సుప్రీంకోర్టు అంటుంటే చెరువులను డంపింగ్‌యార్డుకు కేటాయించడం పట్ల పట్టణవాసులు ఆగ్రహిస్తున్నారు. పట్టణంలో అనేక ఆక్రమణలు ఉండగా వాటిని పట్టించుకోకుండా మంచినీటి చెరువులను పాడుచేయడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

ఆకివీడు శివారు కాపవరం రోడ్ సమీపంలో 6.22 ఎకరాల్లో ఉన్న కొండయ్య మంచినీటి చెరువు ఉంది. వెంకయ్య వయ్యేరు కాల్వ తవ్వకం సమయంలో కొండయ్య చెరువు తవ్వారని పెద్దలు చెపుతున్నారు.



కిక్కిస, తూడు, గుర్రపుడెక్కతో కొండయ్య మంచినీటి చెరువు



రోడ్డుపైనే పడేస్తున్న చెత్తా చెదారం →

అప్పటి నుంచి రైతులు, కూలీలు, స్థానికులు తాగు, సాగునీటికి ఈ చెరువునే వినియోగించుకొనే వారు. రానురాను గ్రామంలో మంచినీటి చెరువులు ఏర్పడంతో పాటు కొండయ్య చెరువు శివారులో ఉండడంతో వినియోగం తగ్గింది. సుమారు 1980 వరకూ ఈ చెరువు వాడుకలో ఉన్నట్లు తెలుపుతున్నారు. తరువాత అధికారులు పట్టించుకోకపోవడంతో సుమారు రెండు ఎకరాలు ఆక్రమణకు గురైంది. 2002 నుంచి పలు దఫాలుగా అభివృద్ధికి పాలకులు, అధికారులు చర్యలు చేపట్టినా వినియోగంలోకి రాలేదు. నగర పంచాయతీ అయిన తరువాత 2022లో కొండయ్య మంచినీటి చెరువు అభివృద్ధికి సుమారు రూ.18 లక్షలు నిధులు కేటాయించినట్లు పాలకులు తెలుపుతున్నారు.

లిక్కర్ ఫ్యాక్టరీల్లో సీఐడీ సోదాలు

పెదవేగి/ఉంగుటూరు, అక్టోబరు 22: పెదవేగి మండలం వంగూరులోని గౌతమీ ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్(లిక్కర్ ఫ్యాక్టరీ)లో ఏపీ సీఐడీ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. సీఐడీ డీఎస్పీ సత్యానందం సహా ఆరుగురు అధికారుల నేతృత్వంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో గత నాలుగేళ్ళలో మద్యం తయారీ, లావాదేవీల్లో జరిగిన అవకతవకలపై విచారణ నిర్వహించినట్లు సమాచారం. గత నాలుగేళ్ళలో ఏ బ్రాండ్లు తయారు చేశారు. నాణ్యతా ప్రమాణాలు పాటించారా, లేదా అనే దానిపై విచారణ నిర్వహించారు. డిస్టిలరీకి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. డిస్టిలరీ ఇన్‌చార్జ్ ఎక్సైజ్ సీఐ సాయి స్వరూప్, ఏలూరు ఎక్సైజ్ సీఐ కృష్ణ ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఉంగుటూరు మండలం చేబ్రోలు సోరింగ్ స్పిరిట్స్ (లిక్కర్ ఫ్యాక్టరీ)లో రాజమహేంద్రవరం సీఐడీ అదనపు ఎస్పీ ఫరహీన్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. కొన్ని కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.


జేసీబీతో రహదారి పనులు

మార్టేరు-పాలకొల్లు రహదారి మూసివేత

పెనుమంట్ర, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : మార్టేరు సెంటర్ నుంచి కవిటం వరకు సీసీ రోడ్డు నిర్మాణం, రోడ్ విస్తరణ పనుల్లో భాగంగా వచ్చే నెల 12వ తేదీ వరకు కవిటం మార్టేరు రహదారిపై రాకపోకలు నిలిపివేస్తున్నట్లు ఆర్అండ్‌బీ ఏఈఈ ఏఆర్‌వీపీఎస్ యశ్వంత్ తెలిపారు. మార్టేరు నుంచి పాలకొల్లు వెళ్లవలసిన వాహనాలను వయా ఆలమూరు మీదుగా కవిటం వంతెన, భారీ వాహనాలను లంకలకోడేరు మళ్లిస్తున్నట్లు తెలిపారు. పాలకొల్లు నుంచి వచ్చే వాహనాలు లంకలకోడేరు మీదగా మార్టేరు రాకపోకలు అనుమతిస్తున్నామని ప్రయాణికులు సహకరించాలని కోరారు. ట్రాఫిక్ నియంత్రణకు ఇప్పటికే పెనుమంట్ర, పాలకొల్లు రూరల్ పోలీసులకు రహదారి మూసివేత వివరాలను వెల్లడించామని వివరించారు.

రేపు జాబ్ మేళా

ఉంగుటూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు మండలం నారాయణపురం శ్రీ అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 24వ తేదీన జాబ్‌మేళా ఏలూరు జిల్లా డిపార్ట్‌మెంట్ ఆఫ్ యూత్ సర్వీసెస్ మరియు సెట్వెల్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు గట్టిం ప్రవీణ్ కృష్ణ తెలిపారు. మంగళవారం నాడు కళాశాలలో జరిగిన పోస్టర్ విడుదల కార్యక్రమంలో డా.కొండా రవి మాట్లాడుతూ ఈ జాబ్ మేళాను స్థానికులతో పాటు జిల్లాలో అందరు నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉద్యాన కళాశాలలో ప్రవేశానికి మాన్యువల్ కౌన్సెలింగ్

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన వర్సిటీ పరిధిలోని కళాశాలల్లో ప్రవేశానికి ఇంతకు ముందే దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు అక్టోబరు 24, 25 తేదీల్లో మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు రిజిస్ట్రార్ డాక్టర్ బి. శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కౌన్సిలింగ్ ద్వారా విశ్వవిద్యాలయ అనుబంధ 5, అఫ్లియేటెడ్ 3 కళాశాలల్లో ప్రవేశాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ రెండు రోజులు నిర్వహిస్తున్నట్టు వివరించారు. విద్యార్థులు స్వయంగా తగిన ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు.

వెబ్‌సైట్‌లో కేజీబీవీ సిబ్బంది నియామకాల మెరిట్ జాబితా

ఏలూరు అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కుకునూరు, వేలేరు, వేలేరుపాడులో ఉన్న కేజీబీవీల్లో ఒక టీచరు (సీఆర్టీ మ్యాథ్స్), ఆరుగురు బోధనేతర సిబ్బంది ఉద్యోగఖాళీల భర్తీకి సంబంధించిన అభ్యర్థుల మెరిట్ జాబితాలను డీఈవో ఏలూరు వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. జాబితాల్లోని వివరాలపై ఏవైనా అభ్యంతరాలుంటే ఈ నెల 23 సాయంత్రం ఐదుగంటల్లోగా సమగ్రశిక్ష ఏపీసీ కార్యాలయంలో సంబంధిత రుజువులతో సహా అందజేయాలని కోరారు.

వ్యవసాయ విస్తరణాధికారిగా వనీల

ద్వారకాతిరుమల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల సచివాలయం-2లో గ్రామ వ్యవసాయ సహాయకురాలు (వీఏఏ)గా విధులు నిర్వర్తిస్తున్న మండలంలోని తిమ్మాపురానికి చెందిన ఏపూరి వనీలకు పదోన్నతి లభించింది. ఉమ్మడి పశ్చిమగోదావరి స్థాయిలో వ్యవసాయ విస్తరణాధికారి(ఏఈఓ)గా పదోన్నతి లభించింది. జిల్లాస్థాయిలో 30 మందికి పదోన్నతి కల్పించారు. పదోన్నతి సాధించిన ఈమెను గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, పలువురు టీడీపీ నేతలు, గ్రామస్థులు అభినందించారు.



చిన వెంకన్న ఆలయంలో.. ఉగ్రవాదుల కోసం వేట

ఆక్టోపస్ దళాల మాక్ డ్రిల్

ద్వారకాతిరుమల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ద్వారకా తిరుమల చినవెంకన్న ఆలయాన్ని ఆక్టోపస్ బలగాలు మొహరించాయి. శ్రీవారి ఆలయానికి ప్రతిరోజూ వేలాదిగా భక్తులు వస్తుంటారు. ఇంత రద్దీగా ఉండే ఆలయంపై ఒక్కసారిగా ఉగ్రవాదులు ముప్పేట దాడులు చేస్తే ఎలా ఎదుర్కోవాలి... భక్తులను ఎలా రక్షించాలి... ఆలయ ఆస్తులను ఎలా కాపాడాలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఆక్టోపస్ ఏఎస్పీ రాజారెడ్డి, డీఎస్పీ ఎన్‌వి రమణ, సీఐ యుజి విల్సన్, ఆలయ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.



ప్రతి ధాన్యం గింజకు గిట్టుబాటు ధర


సమీక్షా సమావేశంలో మంత్రులు నాదెండ్ల, కొలుసు, అధికారులు

ఏప్రిల్ మొదటి వారం వరకు ధాన్యం సేకరణ

ప్రజల ఆకాంక్షల మేరకు పాలన

జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల

ఏలూరు సిటీ, అక్టోబరు 22: రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష అనంతరం మంత్రి పార్థసారధితో కలిసి పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో అవసరమైతే ఏప్రిల్ మొదటి వారం వరకు ధాన్యం సేకరణ జరుగుతుందన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలుపుతామన్నారు. ప్రతి నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు ప్రత్యేక క్లస్టర్లు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా ఇంచార్జ్ మంత్రిగా ఏలూరు కలెక్టరేట్‌కు విచ్చేసిన మనోహర్‌కు స్థానిక ఎమ్మెల్యేలు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందించారు. జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎస్పీ శివకిషోర్, ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య(చంటి), పత్సమట్ల ధర్మరాజు, సొంగా రోషన్‌కుమార్, చిర్రి బాలరాజు, మద్దిపాటి వెంకట్రాజు, జేసీ పి. ధాత్రిరెడ్డి తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

కౌలు రైతు చట్టంలో మార్పు చేస్తాం..

స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో మంగళవారం జిల్లాలో అమలు జరుగుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై ఎమ్మెల్యేలు, అధికారులతో సమీక్షించారు. రానున్న ఖరీఫ్ నుంచి భూయజమాని హక్కులకు భంగం కలుగకుండా కౌలు రైతుల సంక్షేమానికి కొత్త చట్టాన్ని తీసుకువస్తున్నామన్నారు. జిల్లాలో ఆయిల్‌పామ్, కోకో పంటలకు అనువైన వాతావరణం పరిస్థితులు ఉన్నాయని, వీటి సాగుకు రైతులకు మరింత ప్రోత్సాహం అందించాలన్నారు. సంక్షేమ ఫలాలు పేద ప్రజలకు అందేలా చూడాలన్నారు. మంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ మంత్రి నాదెండ్ల మనోహర్ ఎంతో అనుభవం కలిగిన నేత అని, ఇంచార్జి మంత్రిగా నియమించటం సంతోషించదగ్గ విషయమన్నారు. జిల్లాలో అటవీ భూములను సమగ్రసర్వే నిర్వహించి సరిహద్దులను నిర్ణయిస్తే రైతులు, అటవీ శాఖాధికారులకు ఎటువంటి సమస్యలు ఉండవన్నారు. ఇటీవల వరదలు, భారీ వర్షాలు కారణంగా దెబ్బతిన్న చెరువులకు మరమ్మతులు చేయించాలని, తమ్మిలేరు, బుడమేరు, రామి లేరులలో పూడికతీత, చెత్తను తొలగించాలన్నారు.

కలెక్టర్ కె వెట్రిసెల్వి మాట్లాడుతూ ఇప్పటి వరకు 58 గ్రామ సభలు పూర్తి అయ్యాయన్నారు. రూ. 103 కోట్లతో సిసిరోడ్ల నిర్మాణానికి పరిపాలనా పరమైన ఆమోదం అందించామని, వీటిని జనవరి 15వతేదీ నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 801 పశువుల షెడ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు. ఎస్పీ కె ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ జిల్లాలో కొన్ని పోలీస్ స్టేషన్‌లు శిథిలావస్థలో ఉన్నాయని, వాటి మరమ్మత్తులు చేయాల్సి ఉందన్నారు. అధికారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన వాగ్వాదం.. తోపులాట

ఉంగుటూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం చేబ్రోలు ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద మంగళవారం ఘర్షణ వాతావరణం నెలకొంది. కొద్దిసేపట్లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించే ముందు మినుము విత్తనాలను మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా అందించడానికి రైతులను వ్యవసాయ శాఖ గుర్తించిందని, వారందరూ టీడీపీ వారేనని జనసేన శ్రేణులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇరు పార్టీల నాయకుల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. పరిస్థితి ఉద్రిక్తం కాకుండా ఉండేందుకు ఇరు వర్గాలను పోలీసులు సముదాయించారు.



దీనిపై భీమడోలు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు పి.ఉషా రాజకుమారి మాట్లాడుతూ తాము అసలు రైతుల పేర్లు నమోదు చేయలేదని స్పష్టం చేశారు.


సత్యేంద్ర కుటుంబానికి సాయం అందిస్తున్న దృశ్యం

జనసేన సేవా తత్పరతకు బొలిశెట్టి తార్కాణం

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు, 22(ఆంధ్రజ్యోతి): ప్రజా సేవలో బొలిశెట్టి శ్రీనివాస్ ముందుంటారని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఇటీవల మృతిచెందిన టీడీపీ జనసేన నాయకులైన తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లికి చెందిన పసుమర్తి చందు,. సత్యేంద్ర కుటుంబాలను ఆయన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి మంగళవారం పరామర్శించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తన సొంత నిధులు రూ.5లక్షల చెక్‌ను నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా సత్యేంద్ర కుటుంబానికి అందించారు. అప్పారావుపేటకు చెందిన జనసేన కార్యకర్త మొగలికార్తీక్ తండ్రికి రూ.లక్ష అందించగా టీడీపీ మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్ మరో రూ.30వేలు ఇచ్చారు. అనంతరం జనసేన, నాయకులు నాదెండ్ల మనోహర్, బొలిశెట్టి శ్రీనివాస్‌కు కలిపి గజమాలతో సత్కరించారు.

వృద్ధులను గౌరవించాలి

డీఆర్వో డి.పుష్పమణి

ఏలూరు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ వయోవృద్ధులను గౌరవంగా చూడాలని డీఆర్వో డి.పుష్పమణి తెలిపారు. కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో మంగళవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వయోవృద్ధుల సమస్యల పరిష్కారం కోసం ఆర్డీవో కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.


మాట్లాడుతున్న పుష్పమణి

ఈ సందర్భంగా 15మంది వయోవృద్ధులను సత్కరించారు. అలాగే వయోవృద్ధులకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందచేశారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 150 మంది వయోవృద్ధులు పాల్గొన్నారు. అఖిలభారత సీనియర్ సిటిజన్ ఫెడరేషన్ అధ్యక్షుడు వై.నారాయణమూర్తి, కార్యదర్శి కె.రామచంద్రరావు, శివరామకృష్ణ, ఎస్.జానకిరామరాజు, డీఆర్‌డిఏ పి.డి విజయ్‌రాజు, సెట్‌వెల్ సిఈవో కె.ప్రభాకర్‌రావు, విభిన్న ప్రతిభావంతుల వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏ.డి రామ్‌కుమార్ పాల్గొన్నారు.

సూసైడ్ నోట్ రాసి..

పాలకోడేరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కాల్వలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన వేంద్ర బాలాజీ(28) మృతదేహం మంగళవారం గరగపర్రు శివారు శేరేగూడెం కాల్వలో లభించినట్లు పాలకోడేరు ఎస్సై హరిబాబు తెలిపారు. అత్తిలి శివారు బొంతువారిపాలెంకు చెందిన వేంద్ర బాలాజీ రెండున్నరేళ్లుగా గరగపర్రు శివారు ఉప్పరగూడెంలోని అత్తవారి ఇంటి వద్దే ఉంటున్నాడు. భార్యతో మనస్పర్థలతో సోమవారం రాత్రి పురుగుల మందు తాగి శేరేగూడెం కాల్వలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు ముందు తన అన్నయ్యకు ఫోన్లో తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఉప్పరగూడెం రామాలయం వద్ద సూసైడ్ నోట్ ఉత్తరం రాసిపెట్టినట్లు పోలీసులు తెలిపారు. దీంతో బంధువులు కాల్వలో రాత్రంతా గాలించినా ఆచూకీ తెలియలేదు. మంగళవారం ఉదయం మహదేవపట్నం పంటకాల్వలో మృతదేహం లభించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఐదునెలల పాప ఉంది. పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు త్రి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రెండు నెలల క్రితం ఒక గుర్తు తెలియని వృద్ధుడు రోడ్డు ప్రక్కన స్పృహతప్పిపడిపోవడంతో 108 అంబులెన్సు సిబ్బంది ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న ఆ వృద్ధుడు కోలుకోలేక మృతి చెందాడు. మృతదేహాన్ని ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతుని వివరాలు తెలిసిన వారు ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి రెసిడెన్స్ మెడికల్ ఆఫీసర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

క్రైమ్ కార్నర్

యువకుడి మృతదేహం లభ్యం

యలమంచిలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆదివారం సాయంత్రం నుంచి కనిపించకుండా పోయిన పూలపల్లి గ్రామానికి చెందిన ఈద కోదండరామ్ (19) మృతదేహం సఖినేటిపల్లి వద్ద గోదావరిలో మంగళవారం లభ్యమైందని ఎస్ఐ కె.గుర్రయ్య తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

ఎక్సైజ్ దాడులు.. సారా స్వాధీనం

ఏలూరు క్రైం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమీషనర్ ప్రభుకుమార్ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్లు పి శ్యామ్ భోగేశ్వరరావు, వివిఎస్ ఫణికుమార్ సిబ్బంది కలిసి మంగళవారం జిల్లాలో పలు ప్రాంతాల్లో దాడులు చేశారు. ఏలూరు జిల్లా చాట్రాయి మండలంలోని పోతనపల్లి (గంటిపాడుతండా)లోని సారా తయారీ కేంద్రాలపై దాడి చేసి 1600 బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 50 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. చింతలపూడి మండలం నామవరం గ్రామపరిధిలో వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. మొత్తం నాలుగు కేసులు నమోదు చేశామని దాడులు కొనసాగిస్తామని అధికారులు వెల్లడించారు.

తల్లీ కూతుళ్ల అదృశ్యం

ఇరగవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో భార్య, తన ఇద్దరు కుమార్తెలతో ఇంటి నుంచి బయటకు వెళ్ళిపోయిన ఘటన వేల్పూరులో చోటు చేసుకుంది. పోలీసుల వివరాలు వేల్పూరు గ్రామానికి చెందిన నల్లి నగేష్‌కు 11 ఏళ్ల క్రితం రూప్సీ లక్ష్మీ అనే మహిళతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే వీరిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో గతనెల 29న ఇద్దరి పిల్లలను తీసుకుని ఇంటి నుంచి వెళ్ళిపోయింది. ఆమె ఆచూకీ తెలియకపోవడంతో భర్త నల్లి నగేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మూర్తి వివరించారు.

అదనపు కట్నం కేసు నమోదు

భీమవరం క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : తన భర్త, అత్త, మామలు మరో ఐదుగురు కలిసి అదనపుకట్నం కోసం వేధిస్తున్నారంటూ భీమవరం మండలం చినఅమిరం గ్రామానికి చెందిన సమతం కావ్య వెంకట సాయి నాగవిజయ టూటౌన్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. విజయకు అదే గ్రామానికి చెందిన సమతం కోటి మల్లేశ్వరరావుతో 2019లో వివాహం అయ్యింది. గత కొంతకాలంగా భర్త మల్లేశ్వరరావు, అత్త, మామ, ఆడపడుచు, మరో నలుగురు అదనంగా కట్నం కోసం వేధిస్తున్నారంటూ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రెహమాన్ తెలిపారు.

భార్యాభర్తలపై దాడి..

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పాతగొడవల నేపథ్యంతో భార్యాభర్తలను కొట్టి, చంపేస్తామని బెదిరించిన మాదాసు గంగరాజు మరో 12 మందిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై మంగయ్య తెలిపారు. తిరుమలాపురం గ్రామానికి చెందిన తమిర్సి మోషే ఆటో నడుపుకుని జీవనం సాగిస్తున్నాడు.మోషే ఇంటి వెనుక నివాసం ఉంటున్న మాదాసు గంగరాజుకు పాత గొడవలున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 18న గ్రామ పెద్దలలో పెట్టారు. అనంతరం మోషే తన ఇంటికి వెళ్ళిపోయాడు. తర్వాత మాదాసు గంగరాజు మరి కొంతమంది మోషే ఇంట్లో అక్రమంగా ప్రవేశించి మోషే ను కర్రలు, ఇనుప రాడ్లతో కొట్టి గాయపరిచారు. అడ్డు వెళ్ళిన అతని భార్యను కొట్టి చంపేస్తానని బెదిరించారు. గ్రామ పెద్దలలో పెట్టినా కూడా రాజీ అవ్వకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

తుఫాన్‌తో పలు రైళ్ల రద్దు

ఏలూరు క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో ఈ నెల 24, 25 తేదీల్లో భారీ వర్షాలు, 140 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయన్న వాతావరణ శాఖ సూచనలతో రైల్వే శాఖ అప్రమత్తమైంది. తూర్పుతీర రైల్వే శాఖ ఏలూరు మీదుగా వెళ్ళే 27 రైళ్ళను రద్దు చేసింది.

రద్దయిన రైళ్ల వివరాలు

12703 హౌరా-సికింద్రాబాద్ 24న రద్దు
12552 కామాఖ్యా-ఎస్ఎంవీటీ బెంగుళూరు 23న
22603 కరగ్‌పూర్ - విల్లుపురం 24న
12073 హౌరా-భువనేశ్వర్ 24న
18045 షాలిమార్ - హైదరాబాద్ 24న రద్దు
22851 సత్రగంజి-మంగుళూరు సెంట్రల్ 24న
12841 షాలిమార్ - చెన్నై సెంట్రల్ 24న
12663 హౌరా-తిరుచ్చిరపల్లి 24న రద్దు
12863 హౌరా-ఎస్ఎంవీటీ బెంగుళూరు 24న
18047 షాలిమార్-వాస్కోడిగామా 24న
12839 హౌరా - చెన్నై సెంట్రల్ 24వ తేదీ రద్దు
22644 పాట్నా - యర్నాకుళం 24వ తేదీ రద్దు
06090 సత్రగంజి - చెన్నై సెంట్రల్ 24న
12514 సిల్‌చార్ - సికింద్రాబాద్ 23వ తేదీ రద్దు
12513 సికింద్రాబాద్ - సిల్‌చార్ 26 వరకు రద్దు
22504 డిబ్రగర్ - కన్యాకుమారి 23వ తేదీ రద్దు
17016 సికింద్రాబాద్-భువనేశ్వర్ 23వ తేదీ రద్దు
12840 చెన్నై సెంట్రల్ - హౌరా 23న రద్దు
12868 పాండిచ్చేరి - హౌరా 23న రద్దు
22826 చెన్నై సెంట్రల్ - షాలిమార్ 23న
12897 పాండిచ్చేరి - భువనేశ్వర్ 23న రద్దు
18464 కెఎస్ఆర్ బెంగళూరు - భువనేశ్వర్ 23న
11019 సీఎస్టీ ముంబై - భువనేశ్వర్ 23న
12509 ఎస్ఎంవిటి బెంగళూరు - హౌహతి 23న
12842 చెన్నై సెంట్రల్ -హౌరా 24వ తేదీ రద్దు
22808 చెన్నై సెంట్రల్-సత్రగంజి 24వ తేదీ రద్దు
15227 ఎస్ఎంవిటి బెంగుళూరు - ముజాఫర్‌పూర్ 24వ తేదీ రద్దు

ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసమే 'ఇన్నోమేన్'

ఏలూరు అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ వ్యాపారవేత్తలను ప్రోత్సహించేందుకు నెట్ వర్కింగ్ అవకాశాల ప్రాముఖ్యతపై మంగళవారం స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో వివిధ జిల్లాల్లోని డిగ్రీ, పీజీ కళాశాలల బీబీఏ, ఎంబీఏ విద్యార్థులకు 'ఇన్నోమేన్' మేనేజ్‌మెంట్ మీట్‌ను నిర్వహించారు. మైక్రో లింకింగ్ ఐటీపై డైరెక్టర్ గోవిందరావు మాట్లాడుతూ పరిశ్రమ నిపుణులు, సహచరులతో కలసి భవిష్యత్తు ప్రణాళికలను రూపొందించుకునే అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆధునిక వ్యాపార ధోరణులకు అవసరమైన నైపుణ్యాలు, వాటిపై పట్టు సాధించడానికి అనుసరించాల్సిన మెళకువలపై సూచనలిచ్చారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ మీట్‌లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల ద్వారా విద్యార్థులు లోతైన ఆలోచనలు, వ్యూహాత్మక నిర్ణయాలను పొందేందుకు ఉపకరిస్తుందన్నారు. తమ సామర్థ్యాలను, ఆచరణాత్మకమైన అవగాహనకు మంచి వేదికగా నిలిచిందని ఆచార్య నన్నయ వర్సిటీ ప్రొఫెసర్ పి.విజయవాణి పేర్కొన్నారు. కళాశాల మేనేజ్‌మెంట్ విభాగాధిపతి పి.విజయ లక్ష్మి, అధ్యాపకులు హెప్సిబా, వైస్ ప్రిన్సిపాల్ మరియా క్రిస్టియా, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సిస్టర్ సుశీల తదితరులు పాల్గొన్నారు.



పోటీల విజేతలు వీరే...

'ఇన్నోమేన్' రాష్ట్రస్థాయి మేనేజ్‌మెంట్ మీట్‌లో భాగంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. 'ఇగ్నైట్ ది స్టేజ్' విజేతలుగా ఎం.త్రిష (విజయవాడ స్టెల్లా కళాశాల), బి.సుమంత్, టి.హరిదుర్గాప్రసాద్ బృందాలు (ఆదిత్య కళాశాల) ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. 'మిస్టర్ ఇన్నో మేన్' పోటీలో ఎ.భార్గవ్ బృందం (ఆదిత్య కళాశాల) విన్నర్‌గా, జి.మహేష్ రన్నరప్‌గా, 'మిస్ ఇన్నో ఉమెన్'లో వి.అభయన్య (నరసాపురం వై.ఎన్.కళాశాల) విన్నర్‌గా, ఏ.రేష్మ(సీఆర్ రెడ్డి కళాశాల) రన్నరప్‌గా బహుమతులు గెలుచుకున్నారు.

పారదర్శకంగా ఎంపీహెచ్ఏ పదోన్నతులు

ఏలూరు అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ గ్రేడ్-3 ఏఎన్ఎంలకు ఎంపీహెచ్ఏ (ఫిమేల్)లుగా పదోన్నతులు కల్పించే విషయమై ఇటీవల నెలకొన్న వివాదం నేపథ్యంలో మంగళవారం ఏపీ ఎన్జీవోల సంఘం జిల్లా నాయకులు డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠను కలుసుకుని చర్చలు జరిపారు. పదోన్నతుల ప్రక్రియ కనీసం ప్రాథమిక దశను కూడా దాటకముందే డీఎంహెచ్‌వో కార్యాలయంలో కొందరు లంచాలు పుచ్చుకుని పదోన్నతులు ఇచ్చేసినట్టు జరుగుతున్న ప్రచారంపై తాము నేరుగా ఏఎన్ఎంలను ఆరాతీశామని వివరించారు. పదోన్నతులు విధి విధానాలు, సీనియార్టీ, రిజర్వేషన్ కం రోస్టర్‌ప్రకారమే జరుగుతాయని, ఇందులో ఎవరైనా లంచాలకు డిమాండ్ చేస్తే నేరుగా తనకు తెలియజేయవచ్చునని డీఎంహెచ్‌వో ఎన్జీవో నేతలకు స్పష్టం చేశారు. లంచాల అభియోగాలపై రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు ఐవీఆర్ఎస్ కాల్స్‌ద్వారా సంబంధిత ఏఎన్ఎంలను కూడా విచారించారని, ప్రలోభాలకు పాల్పడలేదని తేలిందన్నారు. పదోన్నతుల ప్రతిపాదనలపై విడుదలచేసిన ప్రాథమిక జాబితాపై ఇంతవరకు మొత్తం 297 అభ్యంతరాలు అందాయని, వీటిని పరిష్కరించి తాత్కాలిక జాబితా త్వరలో విడుదలచేసి, దానిపైనా అభ్యంతరాలు తీసుకుని పరిష్కరించిన తర్వాతే తుది జాబితా విడుదల చేస్తామన్నారు. డీఎంహెచ్‌వోను కలిసిన వారిలో ఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, రామారావు, శ్రీధర్‌రాజు, లక్ష్మణకుమార్, నరేంద్ర ఉన్నారు.

4 కేజీల కణితి తొలగింపు



డాక్టరు కు కృతజ్ఞతలు చెబుతున్న రోగి భర్త రవి (ఇన్‌సెట్) తొలగించిన కణితి

జంగారెడ్డిగూడెం,అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ సూర్యతేజ ఆసుపత్రి నందు అరుదైన శస్త్ర చికిత్స ద్వారా మహిళ కడుపులో నుంచి నాలుగు కేజీల కణితి(ఫైబరాయిడ్) ను తొలగించినట్లు డాక్టర్ చిట్టిబోయిన పావని తెలిపారు. మంగళవారం ఆసుపత్రి వద్ద విలేకరుల సమావేశంలో డాక్టర్ పావని మాట్లాడుతూ మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన కంభపు సుబ్బలక్ష్మి అనే మహిళ నాలుగేళ్ళుగా కడుపునొప్పితో బాధ పడుతూ సాధారణ వైద్యం తీసుకుంటుంది. అధిక కడుపు నొప్పితో తమ ఆసుపత్రిలో చేరిన ఆమెకు స్కానింగ్ తీయగా 20 సెంటిమీటర్లు ఉన్న కణతి ఉన్నట్లు గుర్తించామన్నారు. వెంటనే శస్త్రచికిత్స చేసి కడుపులో ఉన్న నాలుగు కేజీల కణితి తీసివేసినట్లు ప్రస్తుతం పేషెంట్ ఆరోగ్యంగా ఉన్నారు. ఈ సందర్భంగా సుబ్బలక్ష్మి భర్త రవి శస్త్ర చికిత్స నిర్వహించిన డాక్టర్ పావని కు కృతజ్ఞతలు తెలియచేస్తూ పుష్పగుచ్ఛం అందచేశారు. ఆసుపత్రి యాజమాన్యం రామకృష్ణ,హేమంత్ పాల్గొన్నారు.


వరి క్షేత్రాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

భారత వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్తలు

వరిరకాల ప్రదర్శనా క్షేత్రం పరిశీలన

పెనుమంట్ర, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాగులో ఉన్న వరి రకాల ప్రదర్శనా క్షేత్రాన్ని భారత వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్తలు మంగళవారం సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. పరిశోధన కేంద్రంలో ఉన్న మూల విత్తనోత్పత్తి క్షేత్రం, ప్రజననకారుని విత్తనో త్పత్తి క్షేత్రాలు, విత్తన గిడ్డంగి, విత్తన శుద్ధి కర్మా గారాలను సందర్శించి సూచనలు చేశారు. తదుపరి మార్టేరు పరిశోధనా స్థానంలో జరుగు తున్న పరిశోధన మరియు విత్తనోత్పత్తి కార్యక్ర మాలపై అభినందించారు. ఈ పర్యటనలో భారత వ్యవసాయ పరిశోధనా మండలి (కొత్త ఢిల్లీ)కి చెందిన ప్రధాన శాస్త్రవేత్త (విత్తన అభివృద్ధి శాస్త్రం) సందీప్ కుమార్ లాల్, ప్రధాన శాస్త్రవేత్త అశ్వినీకుమార్, సీనియర్ శాస్త్రవేత్త (విత్తన అభివృద్ధి శాస్త్రం), భోజరాజ నాయక్, (విత్తన అభివృద్ధి శాస్త్రం), ప్రతాప్ భాన్ సింగ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, (ఎం.పి.యు.ఎ.టి, ఉదయపూర్) డా.బనోత్ వినేష్, శాస్త్రవేత్త (విత్తన అభివృద్ధి శాస్త్రం), (ఉత్తరప్రదేశ్) ఉన్నారు. ఆచార్య రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం తరుపున విచ్చేసిన విత్తన సంచాల కులు డా.వై.సతీష్, ప్రధాన శాస్త్రవేత్త డా.కృష్ణా నాయక్, పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్, ప్రధాన శాస్త్రవేత్త (వరి) డాక్టర్.ఎం.గిరిజా రాణి శాస్త్రవేత్త ల బృందం పాల్గొన్నారు.

పురుగు మందుల ఎంపికే కీలకం

పంటను ఆశించే పురుగును బట్టి సస్యరక్షణ మందులు ఎంపిక చేసుకోవాలని శాస్త్రవేత్తలు కోరారు. మంగళవారం మార్టేరు వారి పరిశోధన స్థానంలో రెండో రోజు శిక్షణ తరగతులు జరిగాయి. ప్రధాన శాస్త్రవేత్త ఎస్. దయాకర్ మాట్లాడుతూ గాలివాటం ఎక్కువగా ఉన్నపుడు పిచికారీ చేయరాదని, తప్పనిసరిగా రక్షణ దుస్తులు ధరించాలన్నారు. డాట్ సెంటర్ కో-ఆర్డినేటర్, ఎం.నందకిషోర్ మాట్లాడుతూ వరి పంట తొలి దశలో సింథటిక్ పైరిత్రాయిడ్ మందులు పిచికారీ చేయడం, నత్రజని ఎరువులు విచక్షణా రహితంగా వాడటం వల్ల దోమ ఉధృతి పెరిగే అవకాశం ఉందన్నారు. తెగుళ్ళ విభాగం ప్రధాన శాస్త్రవేత్త వి.భువనేశ్వరి బాక్టీరియా, ఆకు ఎండు తెగులు, కాండం కుళ్ళు తెగుళ్ళు గుర్తించడం, సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై వివరించారు. కేంద్రీయ సస్యరక్షణా కేంద్రం ప్లాంట్ ప్రొటెక్షన్ జాయింట్ డైరెక్టర్ ఎ.సిద్ధిఖి, పలువురు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

కూటమి లక్ష్యం అభివృద్ధి, సంక్షేమం



కొణికిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్

పెదపాడు, అక్టోబరు 22 : ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకెళుతుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. కొణికి, సకలకొత్తపల్లి, సత్యవోలు గ్రామాల్లో మీ కోసం-మీ చింతమనేని కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను అన్ని వర్గాల ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఉప్పలపాటి రాంప్రసాద్, మోరు శ్రావణి, గుత్తా అనిల్, లావేటి శ్రీనివాసరావు, పొట్లూరి యుగంధర్, లావేటి హేమసుందరబాబు, రంభా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో అమరులయ్యారు

టి.నరసాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతల పరిరక్షణలో ఎందరో పోలీసులు అమరులయ్యారని వారి త్యాగాలను గుర్తు చేసుకోవడమే నిజమైన నివాళి అని ఎస్సై ఎం.జయబాబు అన్నారు. పోలీస్ సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక జడ్పీ హైస్కూల్ పోలీస్ అమరవీరుల త్యాగాలను తెలియచేస్తూ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అమరులైన పోలీసుల త్యాగాలను తెలిపే వీడియోలను ప్రదర్శించారు. హెచ్ ఎం.బి.లింగస్వామి, ఏఎస్సై జయకుమార్ తదితరులు ఉన్నారు.

హామీలను అమలు చేయాలి

పెదవేగి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని కాంగ్రెస్ పార్టీ దెందులూరు నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఆలపాటి నరసింహమూర్తి అన్నారు. పార్టీ అధిష్టానం పిలుపుమేరకు ముండూరులో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రేపు పీడీఎస్‌యూ 50 వసంతాల వేడుక

ఏలూరు అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల కార్యవర్గాల ఆధ్వర్యంలో పీడీఎస్‌యూ 50 వసంతాల వేడుకను హైదరాబాద్ ఉస్మానియా యూనివర్శిటీ ఠాగూర్ ఆడిటోరియంలో గురువారం నిర్వహిస్తున్నామని జిల్లా అధ్యక్షుడు నాని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవాల వాల్‌పోస్టర్లను మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో సంఘ జిల్లా నాయకులు ఆవిష్కరించారు. క్రాంతి, శాంతికిరణ్, విశ్వతేజ, పణిశ్రీ పాల్గొన్నారు.

విషయ పరిజ్ఞానంతో విజయకేతనం

ఏలూరు అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పదో విద్యార్థుల కోసం డీసీఈబీ ఆధ్వర్యంలో రూపొందిస్తున్న 'విజయకేతనం' స్టడీ మెటీరియల్‌ను తయారుచేస్తున్న వర్కు షాపును మంగళవారం డీఈవో అబ్రహం సందర్శించారు. ఈ స్టడీ మెటీరియల్‌ను ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ ఉచితంగా అందజేస్తామన్నారు. డీసీఈబీ కార్యదర్శి ఎ.సర్వేశ్వరరావు, హెచ్‌ఎం. తదితరులున్నారు.

బెల్ట్ షాపులపై చర్యలు

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో బెల్ట్ షాపులు, అక్రమ మద్యం అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు హెచ్చరించారు. ఎక్సైజ్ స్టేషన్‌లో మంగళవారం సీఐ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో 16 మద్యం దుకాణాలు ఇప్పటికే తెరుచుకున్నాయని తెలిపారు.నిబంధనల ప్రకారం పాఠశాలలు, ఆలయాలకు సమీపంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

98 మందికి ఉద్యోగాలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎల్‌టీసీలో మంగళవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు 254 మంది నిరుద్యోగ యువత హాజరుకాగా, వీరిలో 98 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందారని డీఎల్‌టీసీ ప్రిన్సిపాల్ రవి ఓ ప్రకటనలో తెలిపారు.

ముత్యాలమ్మ విగ్రహ ధ్వంసంపై చర్యలు తీసుకోవాలి

చింతలపూడి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్ ఏరియాలో ముత్యాలమ్మ విగ్రహం ధ్వంసం అమానుష చర్యని నిరసిస్తూ స్థానిక హిందూ ధర్మ రక్షణ సమితి ఆధ్వర్యంలో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. స్వామి అయ్యప్ప ఆలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి నాయకులు **సిహెచ్.అంజిబాబు,** కె.ప్రసాద్, కె.రవి, రామకృష్ణ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

నిడమర్రు అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపిడివో విజయకుమారి తెలిపారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రజా సమస్యలపై చర్చిస్తామని, అధికారులు తమ నివేదికలతో హాజరుకావాలని ఆమె తెలిపారు.

ఇంకెన్నాళ్లీ కష్టాలు

- ఛిద్రమైన రహదారులపై ప్రజల పాట్లు
- పడుతూ లేస్తూ ప్రయాణాలు
- రోడ్లు నిర్మించాలని వేడుకోలు

జీలుగుమిల్లిలో..



జీలుగుమిల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : జీలుగుమిల్లి నుంచి చింతలపూడి వయా ఏలూరు వెళ్లే రహదారి నిర్మాణం దశాబ్ద కాలంగా నిలిచింది. కూటమి ప్రభుత్వం రాకతో రోడ్డు నిర్మాణం చేపట్టి ఆ దారికి మొక్షం కల్పిస్తారని ప్రజలు ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వంలో రూ.20 లక్షల నిధులతో 500 మీటర్ల మేర జీలుగుమిల్లి ప్రధాన సెంటరు నుంచి కొంత వరకు సీసీ రోడ్డు నిర్మించారు. మిగిలిన రోడ్డు ఆలానే ఉండటంతో గోతులు మరింత పెద్దవిగా మారాయి. ద్విచక్ర వాహనాలు సైతం రోడ్డు దాటలేని దుస్థితి. గజం లోతు గోతులతో టి.నరసాపురం మండలం మక్కినవారిగూడెం వరకు ధ్వంసమైంది. ఆర్టీసీ బస్సు సర్వీసు ముక్కుతూ మూలుగుతూ నడిపిస్తున్నారు. మార్గం మధ్యలో టైర్లు పంచరవ్వడం కమాన్ కట్‌లు, గేర్ రాడ్ విరగటం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని ఆర్టీసీ సిబ్బంది చెబుతున్నారు.

ఏలూరు నగరంలో..



ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన ఏలూరు నగరంలో రాకపోకలు సాగించేందుకు నగర ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. నాలుగు చినుకులు పడితే చిన్న చిన్న గోతుల్లో వర్షపు నీరు చేరుకుని మినీ చెరువులుగా దర్శనమిస్తున్నాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు కష్టపడాల్సి వస్తుంది. వాహనదారులతోపాటు బాటసారులు కూడా బురద చిమ్మి అసౌకర్యానికి గురవుతున్నారు. నగరంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం సమీపంలోనే రోడ్డు ఇలా ఉంటే ఎలా అంటూ ప్రజలు విమర్శిస్తున్నారు. నగరపాలక సంస్థకు కోట్లలో ఆదాయం వస్తున్నాగాని ముఖ్య కూడళ్లలో గోతులు పూడ్చకపోవడం, రోడ్లు నిర్మించకపోతే ఎలా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి గోతులను పూడ్చి రాకపోకలకు సుమార్గం చేయాలని నగర ప్రజలు మక్త కంఠంతో కోరుతున్నారు.

అర్ధాకలితో అలమటిస్తున్నాం.. జీతాలివ్వండి

- వేతన బకాయిలు విడుదల చేయండి
- పారిశుధ్య కార్మికుల డిమాండ్



బుట్టాయగూడెం సీహెచ్‌సీ ఎదుట ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

బుట్టాయగూడెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య కార్మికుల వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.రామ్మోహన్, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారించాలంటూ ఇఫ్టూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రం ఎదుట పారిశుధ్య కార్మికులు ఆందోళన చేశారు. రామ్మోహన్ మాట్లాడుతూ ఆరు నెలలుగా వేతనాలు అందక కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ బోనస్‌లు కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కారించకపోతే నిరవధిక సమ్మెకు వెళతామన్నారు. కె.దారయ్య, ఎం.కృష్ణ, ఎస్.ధర్మరాజు, ఎం.సత్యవతి పాల్గొన్నారు.

● చింతలపూడి : స్థానిక ఏరియా ఆస్పత్రి పారిశుధ్య కార్మికుల దీక్షలు మూడో రోజుకు చేరుకున్నాయి. ఐదు నెలలుగా జీతాలు రావడంలేదని, పీఎఫ్, ఈఎస్ఐ సొమ్ములు కాంట్రాక్టర్ జమ చేయడంలేదని, నిధులు విడుదల చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈ దీక్షలు కొనసాగుతున్నాయి. దీక్షలో టి.బాబు, నాగరాజు, మరియమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం : చాలీ చాలని జీతాలతో అర్ధాకలితో ఏరియా ఆస్పత్రి పారిశుధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి జేవీ రమణరాజు డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన నిరసన దీక్షలు మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఏరియా ఆస్పత్రి వద్ద ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచే వసంతరావు, సీపీఐ, నాయకులు జి.బాలయేసు,బొక్కా శ్రీను, వేముల రాజు,బూరుగు సంజయ్,తోట దయామణి, జ్యోత్స్న, మేరీ, శ్రీను పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు

టి.నరసాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయటం అభినందనీయమని కాల్నిడి శ్రీరాములు అన్నారు. మండలంలోని బచ్చిలేటిగూడెం గ్రామంలో మంగళవారం కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా మహిళలకు స్వయం ఉపాధి కోసం కుట్టు శిక్షణ, పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందించటం, తాగునీటి ఎద్దడి ప్రాంతాల్లో ఉచిత మంచినీటి సరఫరా కోసం వాటర్ ట్యాంకుల ఏర్పాటు వంటి 2008 నుంచి తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి (తపన చౌదరి) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారన్నారు. గ్రామంలో మూడు నెలల పాటు ఉచితంగా నిర్వహించే కుట్టుశిక్షణ శిబిరాన్ని ప్రతి ఒక్క మహిళ వినియోగించుకోవాలని తపన ఫౌండేషన్ ప్రతినిధి గణేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జట్ల రాంబాబు, వేగేశ్న సత్రం రాజు, కురుసం రామచంద్రరావు పాల్గొన్నారు.

ఫత్తేపురంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన



సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పత్సమట్ల

నిడమర్రు అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల అభివృద్ధి కోసం సిమెంట్ రోడ్డు పనులకు పెద్దఎత్తున శ్రీకారం చుట్టిన ఘనత చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు దక్కుతుందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. ఫత్తేపురంలో రూ.65 లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించబోయే సీసీ రోడ్డు పనులకు మంగళవారం ఎమ్మెల్యే ధర్మరాజు శంకుస్థాపన చేశారు. సర్పంచ్ నీలపాల సాయిప్రియ, ఉపసర్పంచ్ రుద్రరాజు వెంకటేశ్వరరాజు, పొత్తూరి నరసింహరాజు, చింతలపాటి బాసిరాజు,శరణాల మాలతీరాణి పాల్గొన్నారు.

● ఉంగుటూరు : గొల్లగూడెంలో రూ.90 లక్షలతో, రాచూరులో రూ.45 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు శంకుస్థాపనలు చేశారు. జిల్లా టీడీపీ అధ్యక్షులు గన్నివీరాంజనేయులు, బీజేపీ, టీడీపీ నాయకురాలు శరణాల మాలతీరాణి, అడపా శోభారాణి, అక్కిన నాగమణి, ఎంపీడీవో గంజి రాజ్ మనోజ్, సర్పంచులు కరప శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు దాసరి రాజశేఖర్ బలరాం, వేములపల్లి సుధీర్ పాల్గొన్నారు. రాచూరులో మందా శ్రీనివాసరెడ్డి సర్పంచ్ సీత తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల వినతులపై విచారణ చేస్తాం



గుంటుపల్లి రెవెన్యూ గ్రామసభలో మాట్లాడుతున్న తహశీల్దార్ గెడ్డం ఎలీషా

కామవరపుకోట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : గుంటుపల్లిలో రీ సర్వే పూర్తయిన నేపథ్యంలో రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించేందుకు గుంటుపల్లి సచివాలయం వద్ద తహసీల్దార్ గెడ్డం ఎలీషా రెవెన్యూ గ్రామసభ ఏర్పాటు చేశారు. మైసన్నగూడెం, రాజునాగులపల్లి, గుంటుపల్లి నుంచి రైతుల సమస్యలు పరిష్కరించాలని, రికార్డుల్లో మార్పులు చేయాలని వినతి పత్రాలు అందచేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ విచారణ చేసి బాధితులకు పూర్తి స్థాయి లో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ బి.సౌజన్య, మండల సర్వేయర్ కె.లత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి.రామకృష్ణ, వీఆర్వో కె.ప్రభాకరరావు, పంచాయతీ కార్యదర్శి బి.రత్నకుమారి, టీడీపీ నాయ కులు కంఠమనేని అంజిమూర్తి పాల్గొన్నారు.

● లింగపాలెం : భూ సమస్యలు పరిష్కరించుకునేందుకు త మ భూమికి సంబంధించిన ఆధారాలతో రై తులు రావాలని తహసీల్దార్ నజీముల్లా షా సూచించారు. మఠంగూడెం, చంద్రన్నపా లెం లలో మంగళవారం రీ సర్వేపై గ్రామ సభ నిర్వహించారు.

ఆధునిక విధానాలతో లాభసాటి సాగు



పెదవేగిలో సాగులో మెళకువలు తెలుపుతున్న శాంతి

పెదవేగి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : సాగులో పెట్టుబడికి తగ్గ రాబడిని పొందాలంటే నూతన విధానాలను అందిపుచ్చుకోవాలని ఉద్యానశాఖ సహాయ సంచాలకులు శాంతి అన్నారు. పెదవేగి, లక్ష్మీపురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆధునిక, సాంకేతిక విధానాలతో కలిగే లాభాలను వ్యవసాయాధికారులు రైతులకు వివరించారు. సర్పంచ్‌లు తాతా శ్రీరామ్మూర్తి, మేకా కనక రాజు, ఏవో ఎం.ప్రియాంక, ఉద్యానశాఖాధికారి కె.రత్నమాల, పశు వైద్యాధికారి డాక్టర్ తారకేశ్వరరావు, డీఆర్‌సీ ఏవో శ్రీదేవి, రైతులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం : వెంకటరామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ వి.దీప్తి, డాక్టర్ పి.విజయలక్ష్మీ కామయ్యకుంట, రాజానగరం గ్రామాల్లో పర్యటించి వరి, మొక్కజొన్న, అపరాల పంటలను పరిశీలించారు. ఏవో డి.ముత్యాలరావు, పట్టు పరిశ్రమ శాఖ అధికారి పి.సత్యన్నారాయణ, వ్యవసాయ సహాయకులు, పశు సంవర్ధక శాఖ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

● లింగపాలెం : రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని ఏవో మురళీకృష అన్నారు. సింగగూడెం, రంగాపురం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. పంటలో తెగుళ్లపై వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలని అన్నారు. సర్పంచ్‌లు ఎం.రా ము, బి.రాంబాబు పాల్గొన్నారు.

● పోలవరం : గూటాల కొత్తపట్టిసీమ గ్రామాలలో రైతులకు ధాన్యం కొనుగోలు అంశాలపై ఏవో కె.రాంబాబు అవగాహన కల్పించారు. తూర్పుగోదావరి జిల్లా తాళ్ళపూడి నిడదవోలు మండలాలను ఈ ధాన్యం కేంద్రాలకు ట్యాగ్ చేయడం ద్వారా ధాన్యం రవాణా సులభమవుతుందని రైతులు తెలిపారు. వ్యవసాయశాఖ , పశు వైద్యాధికారులు, రైతులు పాల్గొన్నారు.

నేడు ఏలూరులో ఎంపీ పర్యటన

ఏలూరు టూ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ బుధవారం ఏలూరులో పర్యటించనున్నారు. ఉదయం పది గంటలకు స్థానిక జిల్లా కలెక్టరు కార్యాలయంలోని గోదావరి మీటింగ్ హాల్లో జరిగే దిశ సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటి గంటకు క్రాంతి కళ్యాణ మండపంలో జరిగే రిసెప్షన్‌లోను, అనంతరం ఒంటిగంటన్నరకు పెదపాడు మండలం వేంపాడు గ్రామంలో జరిగే దశదిన కార్యక్రమంలో పాల్గొంటారు.

ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ శిక్షణ

ఏలూరు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలోని ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఏడీ జయప్రకాష్ తెలిపారు. ఇందుకు టెట్ అర్హత కలిగి ఉండి వార్షిక ఆదాయం రూ.2.50 లక్షల్లోపు ఉన్నవారు ఈ నెల 25వ తేదీలోగా జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

చికెన్ వ్యర్థాలు స్వాధీనం

పెదపాడు, అక్టోబరు 22 : చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న రెండు ఐషర్ వాహనాలను స్వాధీనం చేసుకు న్నట్లుగా పెదపాడు ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు. పెదపాడు, వసంతవాడ గ్రామాల పరిసరాల్లో సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించి వాహనాలను స్వాధీనం చేసుకుని వాటిల్లోని సుమారు 15 వేల కిలోల చికెన్ వ్యర్థాలను గ్రామానికి దూరంగా గొయ్యి తీసి పూడ్చి పెట్టించినట్లుగా తెలిపారు. వాహన, చెరువు యజమానులతో పాటుగా డ్రైవర్లపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ పథకాలు వర్తింప చేయాలి

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : చేతివృత్తిదారులకు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని సీపీఐ అనుబంధ సంస్థ అయిన ఏపీ చేతివృత్తిదారుల సమైక్య రాష్ట్ర అధ్యక్షులు కడుపు కన్నయ్య పేర్కొన్నారు. స్థానిక బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్.పుష్పలతను మంగళవారం కలుసుకుని సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా కన్నయ్య మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 30 శాతం ఉన్న చేతివృత్తిదారులకు రాష్ట్ర బడ్జెట్‌లో 25 శాతం నిధులు కేటాయించాలని కోరారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్లద్వారా చేతివృత్తిదారులకు రూ.ఐదు లక్షలకు తగ్గకుండా 50 శాతం సబ్సిడీతో రుణాలు అందించి ఆదుకోవాలన్నారు. 50 ఏళ్లు నిండిన చేతివృత్తిదారులలో అర్హత ఉన్న వారికి పెన్షన్ సదుపాయం కల్పించాలని కోరారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను కలుసుకున్న వారిలో ఏఐటీయూపీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసడాంగే, చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు బల్ల కనకదుర్గారావు ఉన్నారు.

కొమరం భీం ఆశయాలను కొనసాగిస్తాం



మర్రిగూడెంలో నివాళులర్పిస్తున్న నాయకులు

టి.నరసాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గిరిజన హక్కులు కోసం పోరాడిన కొమరం భీం ఆశయాలను కొనసా గిస్తామని మర్రిగూడెం గిరిజన పెద్దలు అన్నారు. కొమరం భీం జయంతిని పురస్క రించుకుని మంగళవారం మర్రిగూడెంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొమరం భీం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆదివాసి గిరిజన జెండా ఆవిష్కరించారు. ఆది వాసీల జీవితాల్లో వెలుగులు నింపేందుకు గిరి జన హక్కులు కాపాడేందుకు జల్ జంగిల్ జమే ల్ నినాదంతో కొమరం భీం పోరాడారన్నారు. గిరిజన పెద్దలందరూ మర్రిగూడెంను మద్యం రహిత పంచాయతీగా తీర్మానించారు. పంచాయతీల్లో ఎటువంటి మద్యం, బెల్టు షాపులు, సారా వంటి విక్రయాలు, తయారీలు చేపట్టకూడదని ఎవరైనా విక్రయాలు చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు చేపడతామ న్నారు. గిరిజన పెద్దలు పొట్టా రామా రావు, కురసం నిరీక్షణరావు, కుంజా లోకేశ్, పూనెం ఆదిత్య, నాగేశ్వరరావు, కుంజా వీరాస్వామి, టి.చిన్న నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం : కొమరం భీమ్ స్ఫూర్తితో ఆదివాసీల సమస్యలపై పోరాడాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు కాకి మధు పిలుపునిచ్చారు. షెడ్యూల్ ప్రాంత ఆదివాసీలు ఎస్ఆర్ శంకరన్‌ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కేఆర్ పురం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఆదివాసీ పోరాట యోధుడు కొమరం భీమ్, ఆదివాసీ ఆత్మ బంధువు ఎస్ఆర్ శంకరన్‌ల జయంతి వేడుకలు ఏలూరు జిల్లా ఆదివాసీ ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పలువురు నాయకులు కొమరం భీమ్, శంకరన్‌ల చిత్రపటాలకు పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. ఆదివాసీ యువత చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, పోటీ తత్వంతో ముందుకుసాగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఉద్యోగ నియామకాల చట్టం కోసం ఉద్యమించాలని జిల్లా అగ్నిమాపక అధికారి కొవ్వాసు శ్రీనివాసరావు, ఏఎంవో కె.శిరమయ్య, డీవైఈవో కె.సీలయ్య అన్నారు. జేఏసీ చైర్మన్ మొడియం శ్రీనివాసరావు, కె.దుర్గా రావు, తెల్లం లక్ష్మణరావు, తెల్లం రవిప్రసాద్, సర్పంచ్‌లు, యువజన సంఘాల నాయకులు, ఐటీడీఏ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఉప రాష్ట్రపతిని కలిసిన ట్రైకార్ చైర్మన్



బుట్టాయగూడెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉప రాష్ట్రపతి ముప్పరపు వెంకయ్య నాయుడును ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు మంగళవారం విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వపరంగా తీసుకుంటున్న చర్యలను వివరించి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరామన్నారు.

నాదెండ్లను కలిసిన సొంగా



చింతలపూడి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ మంగళవారం ఏలూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. నిలిచిపోయిన చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసేందుకు, రోడ్ల అభివృద్ధికి, సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. చింతలపూడి అభివృద్ధికి పూర్తి సహకారం అందించాలని కోరినట్టు తెలిపారు.

ఓటు నమోదు చేసుకోవాలి

లింగపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టబద్రులు ఎమ్మెల్సీ ఓట్లు నమోదు చేసుకోవాలని ప్రజల కోసం పనిచేసే నాయకుడిని ఎన్నుకోవాలని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. ధర్మాజీగూడెంలోని అనన్య పాఠశాలలో ఆన్‌లైన్ ద్వారా నమోదు ప్రక్రియ జరుగుతుందని, అనంతరం గ్రాడ్యుయేట్లు, విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, నాయకులు పాల్గొనాలన్నారు.

టీచరు పోస్టుల మంజూరుకు వినతి

ఏలూరు అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ యాజమాన్యంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో కొత్తగా స్కూల్ అసిస్టెంట్ కేడర్ పోస్టులను మంజూరు చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని అభ్యర్థిస్తూ ఏలూరు ఇన్‌చార్జి డీవైఈవో ప్రకాష్‌కు మంగళవారం ఏపీటీఎఫ్ నగర శాఖ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఆయా పాఠశాలలవారీగా మంజూరు చేయాల్సిన సబ్జెక్టు టీచర్ల జాబితాను డీవైఈవోకు సమర్పించారు. రామారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వినికిడి యంత్రాల కోసం పేర్లు నమోదుచేయించుకోండి

ఏలూరు అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వినికిడి సమస్య, చెవుడు ఉన్నవారికి వినికిడి యంత్రాలను ఉచితంగా పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట ఓ ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డు, రేషన్‌కార్డు ఫోటోస్టాట్ కాపీలు, రెండు పాస్‌పోర్టుసైజు ఫోటోలు, చెవుడు తనిఖీ ధ్రువీకరణ పత్రాన్ని ఏలూరు సర్వజన ప్రభుత్వాస్పత్రిలోని డీఈఐసీలో అందజేసి పేరును నమోదుచేయించుకోవాలని సూచించారు.

వసతి గృహాలను తనిఖీ చేసిన జడ్జి రత్నప్రసాద్



ఏలూరు క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని ఎవరైనా అలసత్వం వహిస్తే సహించేదిలేదని జిల్లా న్యాయసేవాధికార సంస్థల కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ అన్నారు. ఏలూరు కొవ్వలిలో ఉన్న సాంఘిక సంక్షేమ సమీకృత వసతి గృహాలను, గుండుగొలను, భీమడోలులోని బాలికల సంక్షేమ వసతి గృహాలను ద్వారకా తిరుమల మండలం సిహెచ్ పోతేపల్లి లోని శ్రీసత్యసాయి అంధ బాలికల వసతి గృహా న్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు అందజేస్తున్న వసతులను తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎటువంటి న్యాయ సహాయం అవసరమైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని లేదా 15100 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు.

జ్వరాలపై అవగాహన

ఏలూరు అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జ్వరాలను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయమని అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు హెచ్చరించారు. స్థానిక ఆముదాల అప్పలస్వామికాలనీ అర్బన్ పీహెచ్‌సీని మంగళవారం సందర్శించి, అక్కడి రోగులకు జ్వరాలపై అవగాహన కలిగించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి నవ్య, వైద్యసిబ్బంది శ్రీనివాస రావు, మాదురి పాల్గొన్నారు.

బొర్రంపాలెం పంచాయతీ కార్యదర్శిగా నాగేశ్వరరావు

టి.నరసాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బొర్రంపాలెం గ్రామ కార్యదర్శిగా పగడం నాగేశ్వరరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు పనిచేసిన శ్రీనివాస్ కృష్ణ తూర్పుగోదావరి జిల్లా దొమ్మేరు బదిలీ అవ్వగా జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం నుంచి నాగేశ్వరరావు బదిలీ పై ఇక్కడకు వచ్చారు.

వీధుల్లో చెత్త తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



మునునూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పడకేసిన పారుశుధ్యం శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. ఈవోపీఆర్డీ సత్యనారాయణ, కార్యదర్శి నాగబాబు ఆధ్వర్యంలో రమణక్కపేట పంచాయతీ పరిధిలో ఉన్న కాలనీలు, రహదారుల పక్కన ఉన్న చెత్తాచెదారాన్ని మంగళవారం తొలగించారు. డ్రెయినేజీ పూడికతీత పనులను రెండురోజుల్లో ప్రారంభిస్తామని ఈవోపీఆర్డీ తెలిపారు.

ఆధార్ శిబిరం పరిశీలన



ఆధార్ క్యాంపును పరిశీలిస్తున్న ఎంపీడీవో

నూజివీడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపును నూజివీడు ఎంపీడీఓ చెన్నరామవేంద్రనాథ్ మంగళవారం పరిశీలించారు. ఉపాధి జాబ్ కార్డులు గల వారికి ఆధార్ కార్డులను అప్‌గ్రేడ్ చేయాలని సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. కార్యదర్శి వి.శ్యామ్‌ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీలు



కలిదిండి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా మంగళవారం కలిదిండి జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు సైబర్ క్రైమ్ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈ నెల 30న బహుమతులు ప్రదానం చేస్తామని ఎస్‌ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

చేనేత కార్మికుల సమస్యల పరిష్కరించాలని విజ్ఞప్తి



టీడీపీ నాయకుడు జనార్దన్‌ను కలసిన చేనేత కార్మిక సంఘ నాయకులు

ముదినేపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నాయకుడు, ఆప్కాబ్ మాజీ చైర్మన్ తొండెపు దశరథ జనార్దన్‌ను మంగళవారం పెదగొన్నూరు చేనేత కార్మిక సంఘ నాయకులు నందం సాయిబాబు, తుమ్మచర్ల గణపతి, దొడ్డిపట్ల సుధాకృష్ణ మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో కలసి చేనేత కార్మికుల సమస్యలను వివరించారు. చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని జనార్దన్ తెలిపారని సాయిబాబు వివరించారు.

ఈ-క్రాప్ నమోదు తప్పుల తడక



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి జమలయ్య

మునునూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా జరిగిన ఈ-క్రాప్ నమోదు తప్పులతడకగా ఉందని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య ఆరోపించారు. మంగళవారం మండలంలోని వలసపల్లి, గుళ్ళపూడి, గుడిపాడు గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదు, రైతులకు ఇచ్చిన కౌలు గుర్తింపులు, పంట రుణాల మంజూరును కౌలురైతు సంఘం నాయకులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు గ్రామాల్లో 500మంది కౌలు రైతులు ఉంటే కేవలం 154 మందికి మాత్రమే కౌలు గుర్తింపు కార్డులు మంజూరు చేశారని, వీటిలో కూడా కొన్ని బోగస్ కార్డులు ఉన్నట్లు సర్వేలో తేలిందన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఏ ఒక్క కౌలు రైతుకు పంటరుణాలు ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా పంట నమోదులో తప్పులు సరిచేసి, కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు ఆర్.లక్ష్మణరావు, ఎన్.నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఫిజియోథెరపీ

మునునూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ పిల్లల కోసం ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత ఫిజియోతెరపీ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ప్రశాంతి అన్నారు. రమణక్కపేట మెయిన్ పాఠశాల భవిత సెంటర్‌లో మంగళవారం జరిగిన శిబిరంలో పది మంది దివ్యాంగులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. ఐఈఆర్టీలు లక్ష్మీనారాయణరావు, జె.నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

రికార్డుల్లో నమోదు చేయాలి

కైకలూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలో రికార్డులను సక్రమంగా నమోదు చేయకుంటే చర్యలు తప్పవని ఎంపీడీవో రెడ్డిబత్తుల ఫణీంద్ర అన్నారు. ఆలపాడు, పల్లెవాడ, భుజబలపట్నం గ్రామ సచివాలయాలను మంగళవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.

ప్రతిభకు కోత



యోగాలో ట్రిపుల్ ఐటీ విద్యార్థుల టాలెంట్
299 పతకాలతో ఖ్యాతి
రచ్చగెలిచినా ఇంట గెలవలేదు..
మూడేళ్లుగా ప్రోత్సాహక మార్కులు ఇవ్వని అధికారులు

నూజివీడు టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ గురువుగా భారత దేశానికి ఖ్యాతి తెచ్చిపెట్టిన యోగాను ప్రతి కళాశాలలోను ఒక బోధనాంశంగా చేర్చాలని యోగా డే సందర్భంగా భారత ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించారు. ఆర్జీయుకేటీ నూజివీడు క్యాంపస్ కేంద్రంగా అనేక మంది విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ప్రతిభ చూపారు. మొత్తం 299 పతకాలను సాధించడమే కాక గత టీడీపీ హయాంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఎదుట ప్రదర్శనలు చేసి సెల్యూట్ కొట్టించు కున్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ అధికారులు మాత్రం తమని గుర్తించలేదని ప్రోత్సాహక మార్కులను గత మూడేళ్లుగా ఇవ్వకుండా నిరుత్సాహపరిచారని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు.

299 పతకాలతో అగ్రస్థానం

దేశంలోని ఇతర యూనివర్సిటీలతో పోలిస్తే ఆర్జీయుకేటీ నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు యోగాసన పోటీల్లో అగ్రస్థానంలో నిలుస్తున్నారు. అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర యోగా పోటీల్లో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు 170 బంగారు పతకాలను, 74 రజత, 55 కాంస్య పతకాలను గెలుచుకున్నారు. ఒక్క నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ నుంచి 3,500 మంది విద్యార్థులు యోగాలో నిష్ణాతులుగా తయారయ్యారు. ప్రస్తుతం 500 మంది విద్యార్థులు యోగశాలలో తర్ఫీదు పొందుతున్నారు.



ప్రోత్సాహక మార్కులు నిల్

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు మూడేళ్లుగా ప్రోత్సాహ మార్కులు ఇవ్వడంతో అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారు. గత ప్రభుత్వంలో ఈ విషయంపై విద్యార్థులు ట్రిపుల్ ఐటీ ఉన్నతాధికారులు, చాన్సలర్ కేసీ రెడ్డికి రాతపూర్వకంగా అనేక అభ్యర్థనలు పంపారు. విద్యార్థులకు ప్రోత్సాహక మార్కులు కలపాలని నాటి చాన్సలర్ సూచనలు చేసినా ట్రిపుల్ ఐటీ అధికారులు పట్టించుకోలేదు. చాన్సలర్ నిర్ణయం పైనే మరో కమిటీ వేసి కాలయాపన చేశారు. క్రీడాంశాల అభివృద్ధి, క్రీడాకారులకు అందించాల్సిన ప్రోత్సాహకాలకు సంబంధించిన అంశాలపై ఆయా క్రీడల్లో నిష్ణాతులైన వారితో కమిటీలను ఏర్పాటు చేయాలని కానీ నూజివీడు ట్రిపుల్ ఐటీలో అందుకు విరుద్ధంగా సంబంధం లేని వారిని నియమించారని దీంతో విద్యార్థులకు సరైన న్యాయం జరగడం లేదని ఆరోపణలున్నాయి.

మార్కుల కోతతో నిరుత్సాహం

ఆర్జీయుకేటీ నిబంధనల ప్రకారం గత టీడీపీ హయాంలో 2019లో క్రీడలు, ఎన్‌సీసీ, యోగశాలలో పాల్గొన్న క్రీడా కారులకు ప్రోత్సాహక మార్కులను నిర్దేశించారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తే 15 మార్కులు, పాల్గొనవారికి 10, జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తే 10, పాల్గొన్న వారికి 5, దక్షిణ భారతస్థాయిలో పతకాలు సాధిస్తే 8, పాల్గొన్నవారికి 3 మార్కులు ప్రతి సబ్జెక్టు ఇవ్వాలని గతంలో నిర్ణయించారు. ఆ నిర్ణయాలను తోసిరాజని నేడు ప్రోత్సాహక మార్కుల జారీలో కోత విధించారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన వారికి 3 మార్కులు, పాల్గొన్న వారికి 2, జాతీయస్థాయిలో పతకాలు సాధించిన వారికి 2, పాల్గొన్న వారికి 1 మార్కు మాత్రమే కలపాలని నిర్ణయించడంతో యోగా క్రీడాకారుల్లో నిరుత్సాహం నెలకొంది. దీనిపై ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ డాక్టర్ అమరేంద్ర కుమార్‌ను వివరణ అడగ్గా ప్రోత్సాహక మార్కులు విషయం తన దృష్టికి వచ్చిందని, వారంలోపు ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని నూజివీడు వివరణ ఇచ్చారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్య సమాజం

నూజివీడు/మండవల్లి/కలిదిండి/చాట్రాయి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం కానుకొల్లు రైతు సేవా కేంద్రం వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి షేక్ జరీనా ఆదేశాల మేరకు ఆర్ఎస్ఎ సంధ్య ఆధ్వర్యంలో రైతులకు మినుములు వీబీఎన్-8 మినికిట్‌ని సర్పంచ్ నాగదాసి థామస్ చేతుల మీదుగా అందజేశారు. కలిదిండి మండలం కోరుకొల్లులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ సాగులో నూతన పద్ధతులు అవలంబిస్తే తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించవచ్చన్నారు. సర్పంచ్ బట్టు లీలా కనకదుర్గ, మాజీ ఎంపీపీ వలవల రామారావు, మాజీ వైస్ ఎంపీపీ



మండవల్లి మండలం కానుకొల్లులో మినీ కిట్‌లను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆమజాల బాబులు, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నున్న సుబ్రహ్మణ్యం, పశువైద్యాధికారి ఫణి, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు. చాట్రాయి మండలం చీపురుగూడెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. విజయ డెయిరీ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, టీడీపీ నాయకుడు బొట్టు లక్ష్మణరావు, ఏవో శివశంకర్ మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగు మందులు విచక్షణా రహితంగా వినియోగించటం వల్ల నేల నిస్సారంగా మారటమే కాక ఈ పంటలు తిన్న ప్రజలు రోగాల బారిన పడుతున్నారని అన్నారు. కోటపాడులోను పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. నూజివీడు మండలం తుక్కులూరులో ఏవో జి.విద్యాసాగర్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ సేంద్రియ సాగుకు ప్రత్యేక గుర్తింపు ఇస్తుందని, ఈ గుర్తింపు వల్ల వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్‌ను పొందవచ్చని తెలిపారు.

గ్రామసభల్లో వచ్చిన అర్జీలకు తక్షణ పరిష్కారం

నూజివీడు/ కైకలూరు/ కలిదిండి/ ముదినేపల్లి/చాట్రాయి/మునునూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ గ్రామసభల్లో వచ్చిన రైతుల అర్జీలను తక్షణమే పరిష్కరిస్తామని ఇన్‌చార్జి తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం అన్నారు. కైకలూరు మండలం భుజబలపట్నంలో మంగళవారం రెవెన్యూ గ్రామసభను నిర్వహించగా మొత్తం 42 అర్జీలు వచ్చాయి. జడ్పీటీసీ మాజీ సభ్యులు ముదునూరి సీతారామారాజు, మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాధరాజు, సర్పంచ్ గురజాల రామసీత, మాజీ సర్పంచ్ గుజ్జుల రామలక్ష్మీ, ఆర్‌ఐ వెంకటేశ్వరరావు, సర్వేయర్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు. కలిదిండి మండలం పోతుమర్రులో నిర్వహించిన భూ రీ సర్వే గ్రామసభలో భూ సమస్యలపై 130 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. సర్పంచ్ జి.వరలక్ష్మి, ఆర్‌ఐ శ్యామల, సర్వేయర్ మహమ్మద్ షమీ, వీఆర్వో జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ముదినేపల్లి మండలం గోకినంపాడు, సింగ రాయపాలెం, దేవరం గ్రామాల్లో తహసీల్దార్ సుభానీ, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ శాఖ రీ సర్వే గ్రామసభలు నిర్వహించింది.



నూజివీడులో నిర్వహిస్తున్న రీసర్వే గ్రామసభ

ఉమ్మడి ఎల్‌పీలను విభజించి వ్యక్తిగత ఎల్‌పీలను రైతులకు కేటాయించాలని పలువురు రైతులు కోరారు. చాట్రాయి మండలం బూరుగ్గూడెంలో మంగళవారం రీసర్వే గ్రామసభ జరిగింది. 33 మంది రైతులు భూ సమస్యలపై అర్జీలు సమర్పించారు. ఎంపీపీ లంకా నిర్మల, డీటీ గీత, సర్వేయర్ లక్ష్మీనారాయణ, స్థానిక నాయకులు కేశవరెడ్డి, కృష్ణారెడ్డి, గోవర్ధన రెడ్డి, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.నూజివీడు మండలం రామన్నగూడెం గ్రామంలో రీసర్వే గ్రామసభ నిర్వహించారు. మండలంలోని 11 పంచాయతీల్లో సర్వేపూర్తి చేయగా, సర్వేలో భూమికి సంబంధించి హెచ్చుతగ్గులు గుర్తించారు. దీనిపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేయగా, సంబంధిత సమస్యల పరిష్కారానికి గ్రామసభ నిర్వహించి రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. సర్వే డివిజనల్ ఇన్‌స్పెక్టర్ రంగారావు, డిప్యూటీ తహసీల్దార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. మునునూరు మండలంలోని యల్లాపురం గ్రామంలో రీ సర్వే గ్రామసభలో 28 అర్జీలు అందినట్టు ఇన్‌చార్జ్ తహసీల్దార్ జి.పురుషోత్తమశర్మ తెలిపారు. సర్పంచ్ మొక్కపాటి మురళీకృష్ణ, వీఆర్వో ఫణేంద్ర, టీడీపీ నాయకుడు రావూరి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

నూజివీడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి చంద్రబాబు అందించిన సీఎం సహాయనిధి చెక్కులను మంగళవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు నూజివీడులోని పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు అందించారు. నూజివీడు నియోజకవర్గం పరిధిలోని దేవరగుంటకు చెందిన పల్నాటి నరసింహారావుకు రూ.45,667లు, బోర్వంచకు చెందిన మహ్మద్ రబియా సుల్తానాకు రూ.63, 071లు మంజూరు కాగా సంబంధిత చెక్కులను ముద్దరబోయిన లబ్ధిదారులకు అందించారు.



చెక్కులను లబ్ధిదారులకు అందిస్తున్న ముద్దరబోయిన

హాస్టళ్లను తనిఖీ చేసిన జడ్జి

ముదినేపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ, బీసీ సంక్షేమ శాఖ వసతి గృహాలను మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, కైకలూరు మేజిస్ట్రేట్ వీవీఎస్‌వీ లక్ష్మి మంగళవారం తనిఖీ చేశారు. అంబేడ్కర్ కాలనీలోని ఎస్సీ కళాశాల స్థాయి బాలికల వసతిగృహ భవనం దుస్థితిపై ఆరా తీశారు. అనంతరం బీసీ బాలుర వసతిగృహాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు అనిత, బి.సురేష్ బాబు, కైకలూరు కోర్టు ప్యానల్ అడ్వకేట్స్ పి.ప్రసన్న కుమార్, ముదినేపల్లి ఏఎస్‌ఐ పద్మజ పాల్గొన్నారు.

సమన్వయం అవసరం

ముదినేపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ, సంక్షేమ పథకాల అమలులో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ముదినేపల్లి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ తెలిపారు. మంగళవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు మాట్లాడుతూ భారీ వర్షాలకు సార్వా వరి పంట నష్టపోయిన రైతులందరికీ నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను వివరించారు. ఎంపీడీవో వై.రామకృష్ణ, ఈవోపీఆర్డీ అశోక్, వైస్ ఎంపీపీ రాచూరి రాధా సుకన్య, మండల పరిషత్ కార్యాలయ ఏవో రమణారావు పాల్గొన్నారు.

25న జాబ్‌మేళా

నూజివీడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాల కల్పనకు ఈ నెల 25న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నూజివీడు ప్రభుత్వ ఐటీఐ ప్రధాన అధికారి డి.భూషణం తెలిపారు. అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హత ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

4న ప్రజా హక్కుల ర్యాలీ

చాట్రాయి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రజా వ్యతిరేక పాలనకు నిరసనగా డిసెంబరు 4న విజయవాడలో ప్రజా హక్కుల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరనాద్ మంగళవారం తెలిపారు.

అధికారులపై ఆర్డీవో ఆగ్రహం

మునునూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలపై అందిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని నూజివీడు ఆర్డీవో వాణి ఆదేశించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. పెండింగ్ అర్జీల జాబితాను పరిశీలించిన ఆమె నెలల తరబడి వచ్చిన అర్జీలను పరిష్కరించకుండా ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 120కి పైగా అర్జీలు పెండింగ్‌లో ఉండడంతో ఆర్‌ఐ దీపికపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వీఆర్వోలను సమన్వయం చేసుకుని అర్జీలను పరిష్కారించాల్సిన బాధ్యత మీకు లేదా అని ఆమెను ప్రశ్నించారు. విధి నిర్వహణ సమర్థవంతంగా చేయలేకపోతే ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్ళిపోండి అని ఆర్డీవో అసహనం వ్యక్తం చేశారు. శనివారం నాటికి పెండింగ్‌లో ఉన్న అర్జీలు పరిష్కరించాలని సూచించారు. ప్రతి రెండు రోజులకు ఒకసారి కార్యాలయానికి వస్తానని, పనితీరు మార్చుకోకపోతే శాఖపరంగా చర్యలు తప్పవని ఆర్డీవో హెచ్చరించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం.. కేసు నమోదు

మునునూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మునునూరులో అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తున్న మహిళపై ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. అనగాని సీతామహాలక్ష్మీ అనే మహిళ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు ఎక్సైజ్ ఎస్‌ఐ ఫణికుమార్ ఆధ్వర్యంలో దాడి చేసి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



సమీక్షా సమావేశంలో మంత్రులు నాదెండ్ల, కొలుసు, అధికారులు

ప్రతి ధాన్యం గింజకు గిట్టుబాటు ధర

ఏప్రిల్ మొదటి వారం వరకు ధాన్యం సేకరణ
ప్రజల ఆకాంక్షల మేరకు పాలన
జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల

ఏలూరు సిటీ, అక్టోబరు 22: రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష అనంతరం మంత్రి పార్థసారధితో కలిసి పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో అవసరమైతే ఏప్రిల్ మొదటి వారం వరకు ధాన్యం సేకరణ జరుగుతుందన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలుపు తామన్నారు. ప్రతి నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు ప్రత్యేక క్లస్టర్లు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా ఇంచార్జ్ మంత్రిగా ఏలూరు కలెక్టరేట్‌కు విచ్చేసిన మనోహర్‌కు స్థానిక ఎమ్మెల్యేలు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందించారు. జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎస్పీ శివకిషోర్, ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య(చంటి), పత్సమట్ల ధర్మరాజు, సొంగా రోషన్‌కుమార్, చిర్రి బాలరాజు, మద్దిపాటి వెంకట్రాజు, జేసీ పి. ధాత్రిరెడ్డి తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

కౌలు రైతు చట్టంలో మార్పు చేస్తాం..

స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో మంగళవారం జిల్లాలో అమలు జరుగుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై ఎమ్మెల్యేలు, అధికారులతో సమీక్షించారు. రానున్న ఖరీఫ్ నుంచి భూయజమాని హక్కులకు భంగం కలుగకుండా కౌలు రైతుల సంక్షేమానికి కొత్త చట్టాన్ని తీసుకువస్తున్నామన్నారు. జిల్లాలో ఆయిల్‌పామ్, కోకో పంటలకు అనువైన వాతావరణం పరిస్థితులు ఉన్నాయని, వీటి సాగుకు రైతులకు మరింత ప్రోత్సాహం అందించాలన్నారు. సంక్షేమ ఫలాలు పేద ప్రజలకు అందేలా చూడాలన్నారు. మంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ మంత్రి నాదెండ్ల మనోహర్ ఎంతో అనుభవం కలిగిన నేత అని, ఇంచార్జి మంత్రిగా నియమించటం సంతోషించదగ్గ విషయమన్నారు. జిల్లాలో అటవీ భూములను సమగ్రసర్వే నిర్వహించి సరి హద్దులను నిర్ణయిస్తే రైతులు, అటవీ శాఖాధికారులకు ఎటువంటి సమస్యలు ఉండవన్నారు. ఇటీవల వరదలు, భారీ వర్షాలు కారణంగా దెబ్బతిన్న చెరువులకు మరమ్మతులు చేయించాలని, తమ్మిలేరు, బుడమేరు, రామి లేరులలో పూడికతీత, చెత్తను తొలగించాలన్నారు.

కలెక్టర్ కె వెట్రిసెల్వి మాట్లాడుతూ ఇప్పటి వరకు 58 గ్రామ సభలు పూర్తి అయ్యాయన్నారు. రూ. 103 కోట్లతో సిసిరోడ్ల నిర్మాణానికి పరిపాలనా పరమైన ఆమోదం అందించామని, వీటిని జనవరి 15వతేదీ నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 801 పశువుల షెడ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు. ఎస్పీ కె ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ జిల్లాలో కొన్ని పోలీస్ స్టేషన్‌లు శిధిలావస్థలో ఉన్నాయని, వాటి మరమ్మత్తులు చేయాల్సి ఉందన్నారు. అధికారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన వాగ్వాదం.. తోపులాట

ఉంగుటూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం చేబ్రోలు ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద మంగళవారం ఘర్షణ వాతావరణం నెలకొంది. కొద్దిసేపట్లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించే ముందు మినుము విత్తనాలను మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా అందించడానికి రైతులను వ్యవసాయ శాఖ గుర్తించిందని, వారందరూ టీడీపీ వారేనని జనసేన శ్రేణులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇరు పార్టీల నాయకుల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. పరిస్థితి ఉద్రిక్తం కాకుండా ఉండేందుకు ఇరు వర్గాలను పోలీసులు సముదాయించారు.



దీనిపై భీమడోలు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు పి.ఉషా రాజకుమారి మాట్లాడుతూ తాము అసలు రైతుల పేర్లు నమోదు చేయలేదని స్పష్టం చేశారు.

తుఫాన్‌తో పలు రైళ్ల రద్దు

ఏలూరు క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో ఈ నెల 24, 25 తేదీల్లో భారీ వర్షాలు, 140 కిలో మీటర్ల వేగంతో గాలులు వీస్తాయన్న వాతావరణ శాఖ సూచనలతో రైల్వే శాఖ అప్రమత్తమైంది. తూర్పుతీర రైల్వే శాఖ ఏలూరు మీదుగా వెళ్ళే 27 రైళ్ళను రద్దు చేసింది.

రద్దయిన రైళ్ల వివరాలు

12703 హౌరా-సికింద్రాబాద్ 24న రద్దు
12552 కామాఖ్యా-ఎస్‌ఎంవీటీ బెంగుళూరు 23న
22603 కరగ్‌పూర్ - విల్లుపురం 24న
12073 హౌరా-భువనేశ్వర్ 24న
18045 షాలిమార్ - హైదరాబాద్ 24న రద్దు
22851 సత్రగంజి-మంగుళూరు సెంట్రల్ 24న
12841 షాలిమార్ - చెన్నై సెంట్రల్ 24న
12663 హౌరా-తిరుచ్చిరపల్లి 24న రద్దు
12863 హౌరా-ఎస్‌ఎంవీటీ బెంగుళూరు 24న
18047 షాలిమార్-వాస్కోడీగామా 24న
12839 హౌరా - చెన్నై సెంట్రల్ 24వ తేదీ రద్దు
22644 పాట్నా - యర్నాకుళం 24వ తేదీ రద్దు
06090 సత్రగంజి - చెన్నై సెంట్రల్ 24న
12514 సిల్‌చార్ - సికింద్రాబాద్ 23వ తేదీ రద్దు
12513 సికింద్రాబాద్ - సిల్‌చార్ 26 వరకు రద్దు
22504 దిబ్రగర్ - కన్యాకుమారి 23వ తేదీ రద్దు
17016 సికింద్రాబాద్-భువనేశ్వర్ 23వ తేదీ రద్దు
12840 చెన్నై సెంట్రల్ - హౌరా 23న రద్దు
12868 పాండిచ్చేరి - హౌరా 23న రద్దు
22826 చెన్నై సెంట్రల్ - షాలిమార్ 23న
12897 పాండిచ్చేరి - భువనేశ్వర్ 23న రద్దు
18464 కెఎస్ఆర్ బెంగళూరు - భువనేశ్వర్ 23న
11019 సీఎస్టీ ముంబై - భువనేశ్వర్ 23న
12509 ఎస్‌ఎంవిటి బెంగళూరు - హౌహతి 23న
12842 చెన్నై సెంట్రల్ -హౌరా 24వ తేదీ రద్దు
22808 చెన్నై సెంట్రల్-సత్రగంజి 24వ తేదీ రద్దు
15227 ఎస్‌ఎంవిటి బెంగుళూరు - ముజాఫర్‌పూర్ 24వ తేదీ రద్దు

చిరుత..చిక్కలేదు!

వసంత్ కాలనీలో పాదముద్రలు

ద్వారకాతిరుమల/భీమడోలు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ద్వారకా తిరుమల మండలం ఎం.నాగులపల్లి ప్రజలను హడలెత్తిస్తున్న చిరుత ఇంకా చిక్కలేదు. గత నాలుగు రోజులుగా ఈ గ్రామ సమీపంలో సంచరించినట్టు చిరుత పాద ముద్రలను అటవీశాఖ అధికారులు గుర్తించిన విషయం విదితమే. అయితే మంగళవారం సమీపంలోని భీమడోలు మండలం అంబర్‌పేట వసంతకాలనీ వెనుక ఉన్న చెరకు తోటల వైపుగా చిరుత వెళ్లిందన్న సమాచారం గుప్పుమంది. అక్కడ చిరుత పాదముద్రలు ఉన్నాయన్న సమాచారంతో అటవీశాఖ అధికారులు అక్కడకు చేరుకుని వాటిని పరిశీలించారు. ఆ ప్రాంతంలో ట్రాప్ కెమేరాలను, పట్టుకు నేందుకు అదనపు బోనులను ఏర్పాటు చేసినట్టు అటవీశాఖ అధికారులు తెలిపారు. ప్రజలెవ్వరూ భయ పడాల్సిన పని లేదని కాస్త జాగ్రత్త వహించాలని, రైతులను చెరకు తోటల్లోకి వెళ్లవద్దని వారు సూచించారు. ఇదిలా ఉండగా చిరుత దొరికిందని, మరో వైపు దొరకలేదని సోషల్ మీడియాలో మెసేజ్‌లు మంగళవారం హల్‌చల్ చేశాయి.

పూలే చిత్రపటం ఏర్పాటు

ముదినేపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలోని గ్రంథాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే చిత్ర పటాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు.

